Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, ఆగస్టు 13, 2026 | సంపుటి - 20 | సంచిక 316 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

### ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ

న్యూఢిల్లీ : భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.



2

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

### వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
### అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్
### మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



*తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు.*

హైదరాబాద్ :

తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. 2లో



## చర్చకు తానెప్పుడూ సిద్ధమే

### చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం
### హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. తరువాయి 2లో



## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోతాం

### అర్థవంతమైన మార్గంలో సాగితేనే మంచిది
### జెన్‌జిలకు మోడీ పరోక్ష హెచ్చరికలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. తరువాయి 2లో

## డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

### మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం
### డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి
### పౌరసరఫరాల శాఖ సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం




హైదరాబాద్ :

సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. తరువాయి 2లో



## మహిళా బిల్లు ముద్దు.. డీలిమిటేషన్ వద్దు

### ప్రస్తుత సంఖ్య ఆధారంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
### తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ తీర్మానం

చెన్నై : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకు వచ్చింది. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం 2లో

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ



### ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి
### అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ -ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు 2లో



2

## నేత కార్మికుడి హత్య దుర్మార్గపు చర్య

### రాజకీయ కక్షల కోసం సామాన్యుడిని చంపేస్తారా
### కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి
### అసలు హంతకులను పట్టుకుని శిక్షించాలి
### వెంకటేశం కుటుంబాన్ని పరామర్శించిన కెటిఆర్

## ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

### సంఖ్యా బలం ఉంటేనే వస్తుంది
### అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలే అనర్హతను పరిశీలిస్తున్నాం
### అసెంబ్లీ ఆవరణలో 14,15 తేదీల్లో స్వాతంత్ర్య ఉత్సవాలు
### ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి



అమరావతి : ప్రతిపక్షం అనేది ఒక హోదా..., అది సరిపడా సంఖ్యాబలం ఉంటేనే దక్కుతుందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. అది కోరుకుంటే వచ్చేది కాదని అన్నారు. పరోక్షంగా వైసిపి డిమాండ్‌పై స్పీకర్ స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చున్నారు. సాయంత్రం పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు. 2లో

## దమ్ముంటే అసెంబ్లీకి రండి

### రోడ్డున పడి విమర్శలు చేయడం కాదు
### డిఎస్సీపై అనుమానాలుంటే చర్చించండి
### ఐదేళ్లలో డిఎస్సీ నిర్వహించలేని వారు విమర్శలా
### నిరాధార ఆరోపణలతో ఆందోళన చేయడం సరికాదు
### వైఎస్ జగన్‌కు హోంమంత్రి అనిత సవాల్



అమరావతి : మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్ ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఏపీ హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. అసెంబ్లీలో అన్ని అంశాలను చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 'అధ్యక్షా' అనే అవకాశం కూడా వైకాపా ఎమ్మెల్యేలకు జగన్ ఇవ్వట్లేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్.. ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా బయట ఆరోపణలు చేయడమేంటని వైసీపీని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. తరువాయి 2లో

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

ఒకే దేశం–ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

## మహిళా బిల్లు ముద్దు.. డీలిమిటేషన్ వద్దు

విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ (అ్గ÷తిపతిబిజీబితినీని) కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోతాం

కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జ్‌లను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం దిల్లీలో జరిగింది.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### అపరిచితుల ఫోన్లకు సమాధానం ఇవ్వరాదు

### సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర హెచ్చరిక

ఖమ్మం,ఆగస్ట్12 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, టెలికాం సిబ్బంది పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలు అడగడం, వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగాలు, బహుమతులు, లోన్ల పేరుతో లింకులు పంపి డబ్బులు వసూలు చేయడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి నగదు బదిలీ చేయించడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా నిలిచిపోతుందని లేదా పోలీసు కేసు నమోదైందని బెదిరించినప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని, ఓటీపీ లేదా పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాలను చాలా వరకు అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, ప్రజల సందేహాలను నివృత్తి చేశారు.

## చంద్రబాబు విజినరీ లీడర్

### ఎంపి కలిశెట్టితో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని.. అభివృద్ధికి అసలైన చిరునామా అంటూ కొనియాడారు. ఏ పని చేపట్టినా అద్భుతంగా చేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. నిరంతర శ్రమ, దార్శనికత కలిగిన చంద్రబాబు.. నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబం కలిసింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌కు 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను ఎంపీ అందజేశారు. పుస్తకంలోని ఫొటోలను ముర్ము ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎంపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాకుండా, 'అప్పలనాయుడిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది' అని రాష్ట్రపతి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరుపై ఎంపీని ద్రౌపది ముర్ము అభినందించారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు.అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

## చర్చకు తానెప్పుడూ సిద్ధమే

అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

## నేత కార్మికుడి హత్య దుర్మార్గపు చర్య

రాజన్నసిరిసిల్ల : సిరిసిల్లలో హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వెంకటేశం మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ చిన్నారి పేరు ప్రసన్న. ఐదో తరగతి చదువుతోంది. క్షుద్ర రాజకీయాలు, చిల్లర రాజకీయాల వల్ల ఈ పాప తండ్రిని కోల్పోయింది. ఎందుకు ఆమె తండ్రి చనిపోయాడు.. ఏదైనా చేసి రాజకీయ లబ్ది పొందాలే. అవసరమైతే మనుషుల ప్రాణాలు తీసైనా సరే.. చంపేసి అయినా సరే రాజకీయంగా బద్నాం చేయాలే.. అనే ఒకే ఒక చిల్లర ప్రయత్నంలోవెంగళ వెంకటేశం మన మధ్యలో లేకుండా పోయారు. వాళ్ల భార్య, పాప, తల్లిని అనాథలను చేసి ఆయన పోయారు. రాష్ట్ర రాజకీయాల్లో 20 ఏండ్లుగా నేను కూడా ఉన్నా. ఇంకా చాలా పెద్దలు ఇక్కడ సీనియర్లు కూడా ఉన్నారు. నేను ఎన్నడూ ఇంత దిగజారుడు రాజకీయం, ఇంత దరిద్రపుగొట్టు రాజకీయం జీవితంలో కూడా చూడలేదన్నారు. మా నాన్న రాలేదు..మూడు రోజులు నేను తినలేదు అని ఆ పాప ఏడుస్తూ చెప్తుంటే మనసున్న మనిషి కళ్లల్లో నీళ్లు తిరగక మానవు. గుండె ద్రవించక మానదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలి అనుకుంటే ఎన్నికల్లో తలపడొచ్చు? లేదా నాయకులతో విమర్శలు చేయొచ్చు. మీరు ఇప్పటికే చేస్తున్నట్టుగా కేసులుపెట్టొచ్చు.. వేధించొచ్చు. కానీ మధ్యలో సామాన్యులను సమిధలుగా చేసి, బలిపశువులను చేసి వాళ్ల జీవితాలను ఆగం చేస్తే ఏమొస్తదని కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగుతున్నా. చనిపోయింది వెంకటేశం.. అరెస్ట్ చేసింది చోటామోటా కాంగ్రెస్ నాయకులను. కానీ ఆ చోటామోటా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం పాత్రదారులు మాత్రమే. అసలు సూత్రదారులు పెద్దవాళ్లు వెనకాల ఉన్నరు.. తప్పించుకున్నారు. కానీ మేం వదిలిపెట్టం. వెంకటేశం భార్య మమ్మల్ని అడిగింది. అన్నా న్యాయం జరిగేదాకా మాతో ఉండండి అని అడిగింది. ఇల్లుతో ఇబ్బందికరంగా ఉంది. కొత్త ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుల దగ్గరకుపోతే దాని కోసం నెలరోజులుగా తిప్పించుకుని ఇవాళ ఈ పరిస్థితి తెచ్చారని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే నేనిప్పుడే కలెక్టర్‌తో మాట్లాడి చెప్పిన.. మీరు ఇల్లు ఇస్తరా.. ఇవ్వండి లేదా మా పార్టీ తరపున మేం ఇల్లు కట్టిస్తమనిచెప్పినం. ఇప్పుడు ఆ పాపకు 11 ఏండ్లు. ఆమె పేరు మీద రూ.3 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. ఆమె 18 ఏండ్లు నిండి మేజర్ అయిన తర్వాత మెచ్యూర్ అయ్యేలా డిపాజిట్ కూడా చేశాం. ఆ పాప పదోతరగతి దాకా నేనే చదివిపిస్తానని చెప్పా. చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలనేచిల్లర ప్రయత్నం స్థానిక సిరిసిల్ల కాంగ్రెస్ నాయకత్వం చేసిందో ఇదిఎన్నటికీ కూడా క్షమించరాని నేరం. సభ్య సమాజం కూడా అసహ్యించుకునే దుర్మార్గమైన పరిస్థితని అన్నారు. దయచేసి ఈ కుటుంబానికి న్యాయంచేయాలని పోలీస్ అధికారులను కోరుతున్నానని అన్నారు. ప్రజాప్రతినిధిగా డిమాండ్ చేస్తున్నా. వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు.

## ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు

పోలీసు బ్యాండ్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలను.. ఆ రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాకపోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడదని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకురావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు?కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపుపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అయ్యన్న తెలిపారు. ఆరు నెలలుగా అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం వివిధ స్థాయిలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. కేందప్రభుత్వం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లామని.. తమకు ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో వేచి చూస్తున్నామని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాని సభ్యులకు కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్లాట్స్ కేటాయించాలా. అని ప్రశ్నించారు. ఈ విషయంపైనా ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటా మని తెలిపారు. ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపు జీఏడీపై తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీకి రాని వారు ఎమ్మెల్యేగా ఎందుకని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఒకే లిఫ్ట్ ఉన్నందున పెద్ద వయస్సు ఉన్న వారు కింది అంతస్తులు కోరుకునేవారని ప్రస్తావించారు. అమరావతిలో మాత్రం ఎక్కువ లిఫ్ట్‌లు అందుబాటులో ఉండటం, వెంటిలేషన్, కాలుష్యం తక్కువ తదితర కారణాలతో పెద్ద వయస్సు ఎమ్మెల్యేలు పై అంతస్తులను కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

## దమ్ముంటే అసెంబ్లీకి రండి

ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో.. నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలని అన్నారు. ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి స్పష్టం చేశారు. రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు. జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారి దగ్గర ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలి. ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మెగా డీఎస్సీని పూర్తి చేయలేకపోయిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. డీఎస్సీ పక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని వైసీపీ పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీ దగ్గర ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని అనిత పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు. నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, పరిష్కారం సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వినతులు స్వీకరిస్తున్నారని హోంమంత్రి తెలిపారు. వినతి తీసుకోవడంతోనే బాధ్యత పూర్తయినట్లు కాదని, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ బాధితులకు సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అనిత తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

## డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్ధేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు.అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

### తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ

హైదరాబాద్,ఆగస్ట్12 : తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ?2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ–మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

## రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

### బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

### యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి

హైదరాబాద్ : తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దు కుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబో తున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

### మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ

### మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్12 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయిస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# మీరు మారిపోయారు... మోడీతో ఖర్గే

### సుప్రియా సూలె కూతరు వివాహ రిసిప్షన్‌లో సరదా సన్నివేశం

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : రాజకీయ విభేదాలు పక్కనపెట్టి నేతలు సరదాగా మాట్లాడుకున్న దృశ్యం ఓ వివాహ వేడుకలో కనిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మధ్య జరిగిన చిన్నపాటి సంభాషణ నవ్వులు పూయించింది. దిల్లీలో ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో ఈ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. రిసెప్షన్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే తదితరులు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. అనంతరం ప్రియాంకను పలకరించిన మోదీ.. ప్రియాంకా జీ ఎలా ఉన్నారు? అని అడగగా.. బాగున్నాను... మీరెలా ఉన్నారు? అంటూ ఆమె బదులిచ్చారు. నేను అలాగే ఉన్నాను అని మోదీ నవ్వుతూ అన్నారు. వెంటనే అక్కడే ఉన్న ఖర్గే కల్పించుకుని.. 'అలా ఏమీ లేదు మీరు కొంచెం మారిపోయారు' అంటూ సరదాగా చమత్కరించారు. దీంతో మోదీ నవ్వుతూ ఖర్గే భుజంపై తట్టారు. ఇద్దరూ సరదాగా చేతులు కలుపుతూ నవ్వుకున్నారు. సుప్రియా సూలే కుమార్తె రేవతి వివాహం నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సరంగ్ లఖానీతో జూన్‌లో ముంబైలో జరిగింది. ఢిల్లీలోని 6, జనపథ్‌లో సోమవారం రాత్రి ఘనంగా రిసెప్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖ నేతలు హాజరయ్యారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్,ఆగస్ట్12 : ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు చెందిన బియ్యం ఒక్కసారే పంపిణీ చేస్తున్నారు. దీంతో బియ్యం దళారులు కొనుగోలు చేయడానికి గ్రామాల్లో చక్కర్లు కొడుతున్నారు. మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రం మూడు నెలలకు ఒకసారి అందిస్తుంది. గతవారం నుంచి మూడు నెలల బియ్యం పంపిణి చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోలు అందిస్తున్నారు.

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

### ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి



న్యూఢిల్లీ,ఆగస్ట్12 : ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# ముంబై ఘాట్‌కోపర్ ప్రాంతంలో విరిగిపడ్డ కొండచరియలు

### ఇద్దరు వ్యక్తులు మృతి...శిథిలా కింద చిక్కున్న పలువురు

ముంబై,ఆగస్ట్12 : ముంబైలో భారీ వర్షాల వేళ ఘట్‌కోపర్-కుర్లా రహదారి సమీపంలోని అశోక్ నగర్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున చిరాగ్ నగర్‌లోని గౌషియా చాల్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాథోడ్ మెడికల్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో అక్కడి ఇళ్లు శిథిలాల కింద చిక్కుకున్నాయి. ముంబై పోలీసులు, బీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఆరుగురి మృతదేహాలను వెలికితీసి సమీప ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ముంబై ÷ర్ బ్రిగేడ్, పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, బీఎంసీ వార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లలో చిక్కుకున్న 18 ఏళ్ల సోహెల్ అన్సారీ, 14 ఏళ్ల మొహమ్మద్ అన్సారీలను రక్షించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర్షాకాలానికి ముందే ఈ ప్రాంతంలోని పలు ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడినట్లు డీసీపీ గణెళిశ్ షిండే చెప్పారు. ముంబై మేయర్ రీతూ తవడే, అదనపు మున్సిపల్ కమిషనర్ అవినాశ్ దాకనే.. ఘటనా స్థలాన్ని సందర్శించారు.

## టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

### ఆరు నెలల ముందే తప్పకున్న చంద్రశేఖరన్

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : టాటా సన్స్ ఛైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ ఛైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల మందే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి. గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

# రాయదుర్గం భూదోపిడీని అడ్డుకుంటాం

## గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం: దాసోజు శ్రవణ్

హైదరాబాద్,ఆగస్ట్12 : రాయదుర్గంలో జరుగుతున్న ఈ భూ దోపిడీని అడ్డుకుని తీరుతామని దీనిమీద గవర్నర్, సీఐడీ, సీబీఐ దగ్గరికి పోతామని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. బుధవారం రాయదుర్గం మల్కం చెరువు ఎదురుగా నిర్మిస్తున్న పీఎం ఏక్తా యూనిటీ మాల్ నిర్మాణ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రాయదుర్గంలో రూ.1700 కోట్ల విలువైన 7 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి పీఎం ఏక్తా మాల్ నిర్మాణం పేరుతో తన బినామీ సంస్థలకు ఎలాంటి టెండర్లు లేకుండా కట్టబెట్టారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎంత పెద్ద నేరస్థుడో ఆయనకి కొమ్ము కాస్తున్న అధికారులు కూడా అంతే నేరస్థులని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు కోసం గవర్నమెంట్ రూ.200 కోట్లు లోన్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ వాళ్లకు కళ్లే కనబడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీని నడుపుతున్నది ఐఏఎస్ జయేష్ రంజన్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి అని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్లు దొంగ అగ్రిమెంట్లు, టెండర్లు చేసి వేల కోట్ల రూపాయలు పందికొక్కుల లాగా దోచుకుని తింటాము అంటే కర్రు కాల్చి అధికారులకు కూడా వాతలు పెడతామన్నారు.

## నారాయణపూర్ రిజర్వాయర్‌పై అసత్యాలు తగవు

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ విమర్శలు

కరీంనగర్,ఆగస్ట్12 : ఎల్లంపల్లి ప్రాజెక్టు, నారాయణపూర్ రిజర్వాయర్‌పై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసత్యాలు మాట్లాడుతున్నారని, ఆయన ఈ మాటలు మానుకొని నిజాలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గంగాధర మండలం మధురానగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న నారాయణపూర్ కుడి కాలువను బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గంలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కనీస అవగాహన లేదని దుయ్యబట్టారు. 2004 లో నారాయణపూర్ రిజర్వాయర్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించినా, తట్టెడు మట్టి కూడా తియ్యలేదని అన్నారు. 2014 లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మధురానగర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం తో పాటు, రైల్వే లైన్ కింద బ్రిడ్జి నిర్మాణం తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలోనే పూర్తి చేశానని గుర్తు చేశారు. మంగపేట నిర్వాసితులకు రూ. 14 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం ఎన్నికలు రావడంతో నిలిచిపోయిందని పేర్కొన్నారు. పరిహారంపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గుండాలతో గ్రామస్తులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో, కాంగ్రెస్ పార్టీ హయంలో జరిగిన అభివృద్ధిపై మధురానగర్ చౌరస్తాలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంలో ప్రకటించి పరిహారం అందించాలని లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేల్చిన కమిటీ

### పార్లమెంటరీ కమిటీ ప్యానల్ విచారణలో సంచలన విషయాలు వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలారు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమేనని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది మార్చి 14-15 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈ నోట్ల కట్టలు చాలా వరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్ల కట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్ష్యాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. దీంతో ఈ అంశంపై పెద్ద దుమారం రేగింది. చివరకు దీనిపై పార్లమెంట్ స్పందించింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. అది ఎవరిది.. ఆ డబ్బు ఎంత ఉంటుంది.. వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేక పోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు. అయితే, ఇందుకు తగ్గ సాక్ష్యాల్ని ఆయన చూపించలేకపోయారు. ఆయన చెప్పిన సమాధానాలు నమ్మలేని విధంగా ఉన్నాయి. విచారణ ప్యానెల్ కూడా ఆ ఇంట్లోకి బయటి వ్యక్తులు వచ్చి, అంత డబ్బు ఉంచినట్లు ఆధారాలు లేవని తేల్చారు. మరోవైపు కాలిపోయిన నోట్లు తర్వాత కనిపించకపోవడంపై కూడా వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఈ అంశంలో యశ్వంత్ వర్మను లోక్‌సభ ప్యానెల్ దోషిగా తేల్చింది. వర్మ దోషిగా తేలిన నేపథ్యంలో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్నది ఆసక్తిగా మారింది.

## ఎన్డీఎస్ఏ సూచనలు మేరకు నడుచుకోండి

### మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల సిఎం దిశా నిర్దేశం

హైదరాబాద్,ఆగస్ట్12 : గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోయాలని దిశానిర్దేశర చేశారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలని సీఎం ఆదేశించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్లలోనూ లోపాలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. దేవాదుల నుంచి 9 పంపులతో ఎత్తిపోతల చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల్లో చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టుల కింద పెండింగ్‌లో ఉన్న పరిహారం, పునరావాస చెల్లింపులు వేగవంతం చేయాలని సూచించారు. ముంపు గ్రామాలపై అధికారులు క్షేత్రస్థాయి వాస్తవ నివేదిక ఇవ్వాలని నిర్దేశిరచారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ పరిహారం పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉందని వివరించారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపుపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు కన్‌స్టలెంట్‌ను నియమిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం

### సిఎం నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,ఆగస్ట్12 : మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ఈ నిర్ణయం ఉందని కొనియాడారు. మహిళా సంఘాల సాధికారతకు సీఎం నిర్ణయం మరో ముందడుగని ప్రశంసించారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం కల్పించినందుకు మహిళల తరుపున మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కేంద్రాల ఏర్పాటుతో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. మిల్లింగ్, ధాన్యం నిల్వ రంగాల్లో మహిళా సంఘాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సీఎం నిర్ణయంతో గ్రామీణ మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు-2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మలయాళ స్థానిక ఉచ్ఛారణకు అనుగుణంగా అధికారిక పేరును మార్చాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం 2026 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తూ పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చారు. రెండు సభల్లోనూ బిల్లు ఆమోదం పొందడంతో, తదుపరి రాజ్యాంగపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రం అధికారిక పేరు 'కేరళం'గా మారనుంది. ఇందుకోసం రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో రాష్ట్రం పేరును సవరించాల్సి ఉంటుంది.

# సంపాదకీయం

## డీలిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు !

కాలనుగుణంగా నడుచుకోవడం..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవిడం పాలకుల కర్తవ్యం. శ్రీరాముడంతటి వాడు ప్రజల మనసెరిగి పాలన చేశారు. పూర్వం రాజులంతా అలాగే నడుచుకునే వారు. అలాకాకుండా పీడించిన వారు చరిత్రలో కనుమరుగయ్యారు. నిరంకుశంగా పాలించిన వారు సైతం చరిత్ర లేకుండా పోయారు. భారతదేశంలో అనేకానేక సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. వాటిని పట్టించుకోవడం మానేసిన అధికార, విపక్ష సభ్యులు తమ మానాన తాము సాగుతున్నారు. ఈ మధ్యకాలంలో పార్లమెంట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవీ పెద్దగా చర్చించడం లేదు. పాలకులు అనుకున్నది మాత్రమే చట్టంగా మారుతోంది. దానిపైనా చర్చలు లేవు. విపక్షాలు కూడా గందరగోళం సృష్టించి బయపటడడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారి పోయాయి. ఎవరి పట్టు వారు పట్టడంతో రోజూ సభలను వాయిదా వేయడం మినహా ముందుకు కదలడం లేదు. జంతర్‌మంతర్ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు. మరో వైపు పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జితో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. అందుకే జార్ఖండ్‌పై జవాబ్‌దో అంటూ ఎదురుదాడికి దిగారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును పత్రికలు, ఛానళ్లు కవర్ చేస్తూ...తమవంతు బాధ్యతను నిర్వహి స్తున్నాయి. నిజానికి వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్‌ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా మోడీ వ్యూహం సిద్ధం చేసుకున్నారని అంతా భావించారు. నిజానికి ఈ బిల్లులను ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ బృందం రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెట్టించిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఎన్‌డిఏ మద్దతుదారులంతా భావించారు. కానీ ఇలా తలకిందులు అవుతుదని వారు కూడా భావించి ఉండరు. బహుశా మోడీ కూడా ఇలా జరుగుతుందని ఊహించి ఉండరు. అంతా తాను అనుకున్నట్లుగా సజావుగా సాగిపోతుందని అనుకుని ఉంటారు. నిజానికి పార్లమెంట్ ప్రారంభం రోజే మోడీ సభకు హాజరై ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కాక్రోచ్ పార్టీ ఉద్యమంతో అంతా తలకిందులయ్యింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం వంటివన్నీ మోదీ నాయకత్వాన్ని నిలదీస్తూ వచ్చాయి. ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కూడా ఓ రకంగా ఎదురుదెబ్బగానే భావించాలి. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు దాని ప్రభావంతోనే జార్ఖండ్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే దీనివెనక ఎవరి హస్తం ఉందన్న ఆరా తీస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాలకులు ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సాగాలి. ఇప్పటికైనా విద్యార్థుల ఆందోళనలను సానుకూల దృక్పంథంతో పరిశీలిస్తే, సమస్యను పరిష్కరిస్తే మంచిది. ఇదొక్కటే కాదు.. అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. నిరుద్యోగం, వైద్యరంగం, అధిక ధరలు, వంటివాటిని యుద్ధప్రాతిపదిక పరిష్కరించాలి. డీ లిమిటేషన్ ప్రజలకు అవసరం లేని వ్యవహారం. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినదే కనుక దీనిని పక్కన పెట్టడం మంచిది. మహిళా బిల్లును ప్రస్తు పార్లమెంట్ సభ్యుల సంఖ్యకే పరిమితం చేయడం మంచిది. ఎంపిలు పెరిగితే ఆర్థిక భారం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ దిశగా కృషి చేయకుంటే మోడీ సర్కార్‌కు కష్టాలు తప్పవు. దేశంలో పెరుగుతన్న నిరుద్యోగ సమస్యలతో పాటు, అధిక ధరలు, దోపిడీలు, సైబర్ మోసాలు వంటివన్నీ పరిస్కరించదగ్గ సమస్యలే. కనుక వీటిపై మోడీ సర్కార్ దృష్టి సారిస్తే ప్రజలు ఆదరిస్తారు.

# మక్కా ఒప్పందం భారత్‌కు మేలుకొలుపు



పశ్చిమాసియాలో మారుతున్న భద్రతా సమీకరణలు ఇప్పుడు దక్షిణాసియాను కూడా ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. సౌదీ అరేబియా, పాకిస్తాన్, తుర్కియే దేశాలు కుదుర్చుకున్న మక్కా సమష్టి రక్షణ ఒప్పందం అందుకు తాజా ఉదాహరణ. మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడి జరిగినా మూడింటిపైనా జరిగిన దాడిగా పరిగణించాలన్నది ఈ ఒప్పందంలోని ప్రధాన అంశం. ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు శిక్షణ, నిఘా సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం వంటి రంగాల్లోనూ ఈ మూడు దేశాలు కలిసి పనిచేయనున్నాయి. ఈ ఒప్పందంపై ఇప్పటివరకు సంతకం చేసింది మూడు దేశాలే అయినా ఇందులో చేరేందుకు ఈజిప్టు సైతం ఉవ్విళ్లూరుతోంది. సైనిక మానవ వనరులు, అణ్వాయుధ సామర్థ్యం, యుద్ధ అనుభవం పాకిస్తాన్ బలం. తుర్కియేకు నాటో అనుభవం, అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమ, డ్రోన్లు వంటి ఆధునిక ఆయుధ సంపత్తి వెన్నుదన్ను. సౌదీ అరేబియాకు ఆర్థిక బలం, ఇంధన వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈ మూడు దేశాల బలాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టడమే ఈ కూటమి అసలు ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ ఒప్పందం వెలుగు చూడటానికి పశ్చిమాసియాలో నెలకొన్న అసాధారణ పరిస్థితులే కారణమన్నది ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఇరాన్- ఇజ్రాయల్ మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు, గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడులు, గాజా యుద్ధం, ఇజ్రాయెల్- తుర్కియే మధ్య విభేదాలు.. ఇవన్నీ తాజా కూటమి ఆవిర్భావానికి కారణాలే. విచిత్రమేమిటంటే.. ఈ కూటమిలోని మూడు దేశాలకూ వేర్వేరు భద్రతా ప్రయోజనాలు ఉన్నాయి. పాకిస్తాన్‌కు భారత్ ప్రధాన సవాలు. సౌదీకి ఇరాన్, గల్ఫ్ భద్రత ప్రధాన అంశాలు. తుర్కియేకు సిరియా, కుర్దిష్ సమస్యలు, ఇజ్రాయెల్‌తో విభేదాలు, యూరప్‌తో సంబంధాలు కీలకం. ఇటువంటి భిన్న ప్రయోజనాల మధ్య ఒకే రకమైన సైనిక ప్రతిస్పందనపై ఏకాభిప్రాయం సాధించడం అంత సులభం కాదు. అందుకే మక్కా ఒప్పందం భవిష్యత్తు దాని ప్రకటనల్లో కాదు, దాని అమలుపైనే ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి కమాండ్, సమన్వయంతో కూడిన నిఘా వ్యవస్థ, ఉమ్మడి సైనిక విన్యాసాలు, వైమానిక రక్షణ సహకారం, రక్షణ పరిశ్రమల మధ్య అనుసంధానం వంటి వ్యవస్థలు ఏర్పడితేనే ఇది నిజమైన భద్రతా కూటమిగా ఎదుగుతుంది. నాటో తరహా రక్షణ ఒప్పందం కుదుర్చుకోవాలన్నది సౌదీ అరేబియా కల. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ముస్లిం దేశాలు ఏకమవ్వాలంటూ గతంలో పిలుపునిచ్చినా, అది సాకారం కాలేదు. మరిన్ని కనుగొనండి వీడియో వార్తలు జిల్లా వార్తలు అంతర్జాతీయ వార్తలు పెట్టుబడులకు హబ్ తెలంగాణ తాజాగా గల్ఫ్ దేశాలపై దాడులు, ఉద్రిక్తతలు తాజా ఒప్పందం దిశగా అడుగులు వేయించాయి. అయితే ఇంకా కళ్లు తెరవని ఈ కూటమిని కొందరు నాటోతో పోలుస్తూ 'ఇస్లామిక్ కూటమి'గా అభివర్ణించడం హాస్యాస్పదం. నాటోకు ఉమ్మడి కమాండ్ వ్యవస్థ, సైనిక మౌలిక సదుపాయాలు, దశాబ్దాల సంస్థాగత అనుభవం, సమన్వయంతో కూడిన రక్షణ ప్రణాళిక ఉన్నాయి. మక్కా ఒప్పందానికి అవేవీ లేవు. ఒక సభ్యదేశంపై దాడి జరిగితే మిగిలిన దేశాలు తప్పనిసరిగా ప్రత్యక్ష యుద్ధంలోకి దిగాలా? లేక రాజకీయ, నిఘా, ఆయుధ సహాయం వరకే పరిమితమవుతాయా? వంటి కీలక అంశాలపై ఇంకా స్పష్టత అవసరం. ఈ కూటమి భవిష్యత్తులో మరింతగా విస్తరించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఈజిప్టు, ఖతార్ వంటి ఇతర దేశాల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, సభ్యుల సంఖ్య పెరగడం మాత్రమే కూటమి విజయానికి ప్రమాణం కాదు. భారత్ విషయానికొస్తే, మక్కా ఒప్పందం మనకు ప్రత్యక్షంగా వ్యతిరేకమైనది కాకపోయినా, దాని ప్రభావాలను న్యూఢిల్లీ నిర్లక్ష్యం చేయకూడదు. కారణం.. ఈ కూటమిలో పాకిస్తాన్ ఉండటమే. భవిష్యత్తులో పాకిస్తాన్‌కు తుర్కియే నుంచి అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, నిఘా సహకారం మరింత పెరిగే అవకాశం ఉంది. సౌదీ అరేబియా కూడా పాకిస్తాన్‌తో ఇప్పటికే ఉన్న రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేయవచ్చు. ఇక తుర్కియే విషయానికొస్తే, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఇవ్వడమే కాకుండా, డ్రోన్లు కూడా అందజేసిన సంగతి తెలిసిందే. కాబట్టి, మరో ఆపరేషన్ సిందూర్ తరహా పరిస్థితి ఏర్పడితే తలెత్తబోయే పరిణామాలను ఊహించి, ముందుగానే పశ్చిమాసియా దేశాలతో భారత్ వ్యూహాత్మక వైఖరిని అవలంబించడం ఉత్తమం.

# నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం

**శుభ కార్యాక్రమాలకు అనువైన మాసం**

**అనేక పూజాది వ్రతాలకు పవిత్ర మాసం**

యాదగిరిగుట్ట,ఆగస్ట్12 : హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిథి రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం. దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణోక్తి.. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్టతో, అత్యంత భక్తి శ్రద్దలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం. వివాహాది శుభకార్యాలకు, మంగళ గౌరీ నోములకు, వరలక్ష్మి వ్రతానికి, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ముడివేసే రాఖీ పౌర్ణమి వంటి పండుగలకు శ్రావణ మాసం పెట్టింది పేరు. తెలుగు పంచాంగం ప్రకారం ఐదో మాసమైన శ్రావణ మాసంలో పండుగలు, వ్రతాలతో పాటు శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని అంటారు. శుభాల మాసమైన శ్రావణ మాసంలో పౌర్ణమి నాటి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసమని పేరు వచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఏ పని చేసినా శుభకరమని భావిస్తారు. శ్రావణంలో రానున్న పుణ్య తిథులు - పండుగలు ఇలావున్నాయి. ఆగస్టు 13, గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆగస్టు 13, గురువారం శ్రావణ శుద్ధ పాడ్యమి: శ్రావణ మాసం ప్రారంభం గస్టు 14, శుక్రవారం శ్రావణ శుద్ధ విదియ చంద్రోదయం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం, ఆండాళ్ తిరు నక్షత్రం, ఆండాళ్ తిరుపురంగా భావిస్తారు. ఆగస్టు 15, శనివారం శ్రావణ శుద్ధ తదియ. శ్రీనివాసుడికి ఇష్టమైన రోజు. ఆగస్టు 16, ఆదివారం, శ్రావణ శుద్ధ చవితి: నాగ చతుర్థి, కశ్యప మహర్షి జయంతి కూడా. ఆగస్టు 17, సోమవారం, శ్రావణ శుద్ధ పంచమి: నాగ పంచమి, గరుడ పంచమి, సింహ సంక్రమణం, శృంగేరి శ్రీ విధుశేఖర భారతీతీర్థ స్వామి వారి జన్మదినం, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆగస్టు 18, తిరుచానూరు శ్రీ పద్మావతి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 22, శనివారం శ్రావణ శుద్ధ దశమి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆగస్టు 23, ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి: సర్వ ఏకాదశి, శ్రావణ పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. ఆగస్టు 31, సోమవారం శ్రావణ బహుళ తదియ/ చవితి: పుబ్బ కార్తె ప్రారంభం, సంకష్టహర చవితి కూడా. సెప్టెంబర్ 2, బుధవారం శ్రావణ బహుళ పంచమి/షష్టి: బలరామ జయంతి, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం. సెప్టెంబర్ 4, సెప్టెంబర్ 7, సోమవారం శ్రావణ బహుళ ఏకాదశి: సర్వ ఏకాదశి. సెప్టెంబర్ 8, మంగళవారం శ్రావణ బహుళ ద్వాదశి/ త్రయోదశి: పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. సెప్టెంబర్ 9, బుధవారం శ్రావణ బహుళ చతుర్దశి: మాసశివరాత్రి. సెప్టెంబర్ 11, శుక్రవారం శ్రావణ బహుళ అమావాస్య: పోలాల అమావాస్య ఈ రోజుతో శ్రావణ మాసం సమాప్తమవు తుంది. శ్రావణ మాసంలో రానున్న పండుగలను శాస్త్రంలో సూచించిన విధంగా, పురాణాల ప్రకారం జరుపుకుంటే మంచిది.


# జైలులో మాజీ ఎంపి రేవణ్ణ విలాసాలు

**సెల్‌ఫోన్‌తో పాటు, పెన్ డ్రైవ్ పట్టుకున్న అధికారులు**

బెంగళూరు,ఆగస్ట్12 : అత్యాచారం కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వద్ద సెల్ ఫోన్‌తోపాటు పెన్ డ్రైవ్ లభ్యమైనాయని సెంట్రల్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి నీలి రంగు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, పెన్ డ్రైవ్, ఛార్జర్‌తోపాటు డైరీని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బెంగళూరులోని పరప్పరన అగ్రహారం సెంట్రల్ జైలులో తమ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిందని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు తెలిపారు. మరో వైపు ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ అయింది. రేవణ్ణకు ఆ వస్తువులు ఎలా అందాయనే అంశంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. జైలు అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈరన్న రంగాపూర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జైలులో లోపాలపై వివరణ ఇవ్వాలంటూ జైలు సూపరింటెండెంట్ అనుష్క కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సెంట్రల్ జైలులో దాదాపు ఐదు గంటల పాటు సోదాలు జరిగాయని జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రతాప్ రాయ్ అనే మరో ఖైదీ వద్ద కూడా మొబైల్ ఫోన్ లభ్యమైందని అన్నారు. 019లో హసన్ ఎంపీ, జేడీ (ఎస్) నేత ప్రజ్వల్ రేవణ్ణ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ హోలినరసిపుర రూపల్ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన బెంగళూరులోని ప్రత్యేక కోర్టు అతడిని దోషిగా తేల్చింది. అతడికి జీవిత ఖైదు విధించింది. అలాగే రూ. 10 లక్షల జరిమానా విధించింది. 2025, ఆగస్టు 2వ తేదీన కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. తనపై అతడు అత్యాచారం చేయడమే కాకుండా.. వీడియో కూడా తీశారంటూ బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# కష్టే ఫలి అన్నదే ఆదర్శ సూత్రం !

తిరుమల : సోమరితనం మనిషిని మరింత నాశనం చేస్తుంది.ఎదుటి వారిని చూసి ఏడవడం కాదు. ఆ విధంగా పైకి ఎదగడానికి కష్టపడి పని చేయాలి. అటువంటి ఆలోచన మనసులో బలంగా ఉండాలి..మంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అంతే తప్ప కస్టపడడానికి సిగ్గు పడితేజీవితం నాశనం అవుతుంది. సోమరితనం మనిషిని మరింత చెడ్డ వ్యక్తిగా మారుస్తుంది... జీవితంలా గొప్ప వ్యక్తి గా ఎదగడానికి కృషి చేయాలి. అలాగే సంతోషంగా ఉండేవాడిలో కక్షలు, కార్పణ్యాలు కనిపించవు. ఇతర ఏ పట్టింపులూ ఉండవు. డబ్బుతో అధికారంతో ప్రమేయం ఉండదు. నిజానికి వారికి శత్రువులే ఉండరు. కొందరు ఎన్ని కష్టాలనైనా అవలీలగా భరిస్తారు. అనారోగ్యం సంసార బాధ్యతలు ఒంటరితనం లాంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే ఉల్లాసంగా కనిపిస్తారు. మంచి అలవాట్లు జీవనశైలి సైతం సంతోషాన్నిస్తాయి. భూటాన్ రాజ్యం ధనిక దేశం కాదు. కానీ, అక్కడి ప్రజలు ఎప్పుడూ ఆనందంగా ఉంటారట. చాలావరకు వారంతా వజ్రయాన బౌద్ధులు. తొలి శతాబ్దంలో భారతదేశం నుంచి భూటాన్ వెళ్లిన బౌద్ధ సన్యాసి పద్మసంభవుడు వారికి గురువు. ఆనందంగా జీవించడంలో దైవత్వం ఇమిడి ఉందని ఆయన చెప్పిన సూత్రాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ నమ్ముతారు. అలాంటి జీవన విధానాలనే పాటిస్తారు. ఆనంద స్థితిని అందుకోవడం కష్టతరం కాదని బుద్ధుడి తొలి శిష్యుల్లో ఒకడైన ఆనందుడు రాసిన దమ్మమార్గం చెబుతోంది. ఆనందం అంతరాంతరాళాల్లోంచి ఉబికి వచ్చేది. అనుభవానికి మరే ఇతర లౌకిక ఊరటకు సంబంధం లేదు.



ఆధ్యాత్మికం

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

● దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ ● విద్యార్థులకండ ఏఐఎస్ఎఫ్ జెండా ● ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత--అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ దేశంలోనే తొలి విద్యార్థి సంఘమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సంఘం పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు. తెలంగాణలో విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు కేటాయించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. "విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్



జెండా ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రీతం పేర్కొంటూ, ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా, ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాల్లో శ్వేతఅరుణ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనీషా, శ్రావణి, ఉర్మిళ, అశ్విని, స్వాతి, శ్రీయ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ నిర్మాణం కోసమై పోరాడిన సీతారాం ఏచూరి

● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు ● ఫాసిస్ట్ విధానాలను ప్రతికటించటమే సీతారాం ఏచూరికి అర్పించే నిజమైన నివాళి. ...

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమ సమాజ నిర్మాణం కోసమై అహర్నిశలు పోరాడిన వామపక్ష నాయకులు సీతారాం ఏచూరి గారని విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు చేసి మహాయోధుడని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవల్లి ముత్యంరావు అన్నారు. సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి 74వ జయంతి సందర్భంగా బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి మార్క్సిజాన్ని అధ్యయనం చేసి భారతదేశంలో సమ సమాజ నిర్మాణం కోసం పోరాడాలని నిర్ణయించుకొని జీవితాంతం తన సిద్ధాంతాన్ని ఆచరించడం కోసం కృషి చేశారని అన్నారు. పార్లమెంటు సభ్యుడిగా అనేక ప్రజా సమస్యలను లేవనెత్తడంతోపాటు నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలను కళ్ళకు కట్టినట్టు ప్రజలకు తెలియజేయడంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. వామపక్షాలతో పాటు లౌకిక శక్తుల్ని భారతదేశంలో ఏకతాటి పైకి తేవడంలో కీలక భూమిక పోషించారు, భారతదేశానికి గుండెకాయ లాంటి ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అత్యంత ప్రధానమైన కర్తవ్యం గా ఆయన పనిచేశారని, సామాజిక న్యాయం కోసం వామపక్ష పార్టీలు ముందుండాలని సూచించారు. భారత దేశంలోని భిన్నత్వంలోని ఏకత్వాన్ని ప్రతి సందర్భంలో ప్రస్తావిస్తూ భారతదేశపు యొక్క ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పిహెచ్డి పూర్తి ఏసి గోల్డ్ మెడల్ స్టూడెంట్



గా అనేక అవకాశాలు ఉన్న వాటిని తోసిపిచ్చి భారతదేశంలో సమసమాజ నిర్మాణం తన కర్తవ్యం గా భావించి త్యాగనిరతితో పోరాడిన యోధుడు సీతారామ్ ఏచూరిగారని కొనియాడారు.వారిని స్మరించుకోవడం అంటే నేడు ఫాసిస్టు తరహా విధానాలు అనుసరిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడమే నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, నాయకులు మోదుంపల్లి శ్రావణ్, శ్రీనివాస్ రెడ్డి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా యువత ముందుకు సాగాలి

● ఆరోగ్యవంతమైన సమాజం కోసం 'రన్ ఫర్ హెల్త్'లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలి ● డ్రగ్స్‌కు దూరం... మారథాన్‌కు స్వాగతం ● పెద్దపల్లి ఐడీఓసీలో కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామాలను జీవితంలో భాగంగా చేసుకొని యువత ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.ఆరోగ్యవంతమైన సమాజం, డ్రగ్స్ రహిత యువతే లక్ష్యంగా సెప్టెంబర్ 27న నిర్వహించనున్న నాలుగో కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను పెద్దపల్లి ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు, వాకింగ్, జాగింగ్, రన్నింగ్ వంటి శారీరక వ్యాయామాలను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు చురుకైన జీవనశైలిని కొనసాగించవచ్చని తెలిపారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న హాఫ్ మారథాన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, వ్యాయామం వంటి సానుకూల కార్యకలాపాలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ నడక, పరుగు, వ్యాయామం వంటి వాటిని జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు సమాజంలో డ్రగ్స్ వ్యతిరేక




అవగాహన పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. హాఫ్ మారథాన్‌లో యువతతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, కేఆర్‌సీఏ అధ్యక్షులు పసుల మహేష్, మహిపాల్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీయ పర్యటనలో పలు దేశాల్లో పర్యటించిన మల్లాది వాసు


**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మధిరకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు వ్యాపారం నిమిత్తం ఆఫ్రికా ఖండంలో పలు దేశాలను సందర్శించేందుకు మల్లాది వాసు ఈనెల 8వ తేదీన వెళ్లారు. మొత్తం 20 రోజులు పాటు ఆయన విదేశీపర్యటన చేయనున్నారు.



ఈ పర్యటనలో నైజీరియా, ఘనా, ఉగాండా, సెనెగల్ తో పాటు మరికొన్ని దేశాల్లో పర్యటన చేయనున్నారు. మల్లాది వాసు సెప్టెంబర్ 1న ఇండియాకు రానున్నారు.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి సభ్యత్వం ఇన్సూరెన్స్ మంజూరు

### డా. వాసిరెడ్డి రామనాథంకు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఇటీవల కాలంలో మధిర మండలం, మాటూర్ పేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మాదాల నారాయణరావు సతీమణి మాదాల రమ ఖమ్మంలోని వారి నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే కాగా మృతురాలికి టీడీపీ సభ్యత్వం నమోదు అయి ఉండడంతో టీడీపీ సభ్యత్వ ప్రమాద బీమా నుండి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం పార్టీ అధినాయకత్వం మంజూరు చేసింది కాగా పార్టీ ప్రమాద బీమాకు లబ్ధిదారులు దరఖాస్తు చేసిన నాటి నుండి ఖమ్మం పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ డా.వాసిరెడ్డి రామనాథం ప్రత్యేక చొరవ తీసుకుని తెలంగాణ రాష్ట్ర పార్టీ నాయకత్వం తో మాట్లాడి లబ్ధిదారునికి ప్రమాద బీమా నుండి సహాయం అందేలా కృషి చేశారు, నేడు ఆ భీమా డబ్బులు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ కావడం తో టీడీపీ అధినాయకత్వానికి అలానే వారికి అండగా నిలిచిన డా.వాసిరెడ్డి రామనాథం కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసి టీడీపీ కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి, తెలంగాణ రాష్ట్ర పార్టీ నాయకత్వానికి డా.వాసిరెడ్డి రామనాథం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ములకలపల్లి వినయ్ కుమార్,టిడిపి నాయకులు మార్నేడు పుల్లారావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ఒక ప్రాణం కాపాడటం కంటే గొప్ప దానం మరొకటి లేదు

### గర్భిణీ కి రక్తదానం చేసిన పడిగే శ్రీకాంత్

**కామారెడ్డి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా కూతురు జన్మించిన ఆనందకరమైన రోజునే, ఒక గర్భిణీ మహిళకు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు పడిగే శ్రీకాంత్.నా కూతురు పుట్టిన ఈ శుభదినాన మరో ప్రాణానికి అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది,అనే గొప్ప ఆలోచనతో రక్తదానం చేయడం అభినందనీయం.పేషంట్ కుటుంబసభ్యులు రక్తదాతల సేవ సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ శ్రీధర్ పటేల్ సంప్రదించగానే వెంటనే స్పందించి రక్తం అందించడం ద్వారా పడిగే శ్రీకాంత్ ఒక కుటుంబానికి ఆశను, ఒక తల్లికి



ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ యువత వారి పుట్టినరోజులు, శుభకార్యాలు, విజయాలను తమ ఆనందానికే పరిమితం చేయకుండా... అవసరంలో ఉన్నవారికి అండగా నిలిస్తే అదే నిజమైన వేడుక అని భావించాలి. ఒక్క యూనిట్ రక్తం విలువ ఒక కుటుంబం కన్నీళ్లను ఆనందంగా మార్చగలదు అని సందేశం ఇచ్చారు యువతకి. ఈ కార్యక్రమంలో గుండెల్లి ప్రశాంత్, చందు, సురేష్ దితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానాను సందర్శించిన మండల వైద్యాధికారి



**మానకొండూర్, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల పల్లె దవాఖానాను మండల వైద్యాధికారి సల్మాన్ బుధవారం సందర్శించారు.రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలను పరిశీలించి సీజనల్ వ్యాధులతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యాన్ని సిబ్బందికి తగు సూచనలు చేశారు.వైద్యురాలు స్వీర్య, సిహెచ్ఓ ఖలీముద్దీన్, ఎంపిహెచ్‌ఏలు క్షేమలత, ఉపేంద్ర, ఆశాలు మంజుల శ్రీలత వైద్యాధికారి వెంట సందర్శనలో పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

### మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ



**మహేశ్వరం ఆగస్టు 12, (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ అమలు చేస్తున్న పెన్షన్ విధానానికి అర్హులైన లబ్ధిదారులు చేయూత పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలని మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీతా కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్, బాధితులు పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 31వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు ఫారాలు అందించాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు మాత్రం లబ్ధిదారులు అందించిన పెన్షన్ దరఖాస్తు పత్రాలను ఈనెల 25, వ తేదీ లోపల ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## రంగుకే పరిమితమైన ఉన్నత పాఠశాల బోర్డు



**మహేశ్వరం ఆగస్టు 12, (ది క్రైమ్ న్యూస్):** బాలికల ఉన్నత పాఠశాల చూద్దాం అంటే కనిపించదు చదువుదామంటే పేరు దొరకదు, అదే మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్నా బాలికల ఉన్నత పాఠశాల బోర్డు నల్ల రంగు వరకే పరిమితమైంది ఐతే కొన్ని నెలల క్రితం పాఠశాలకు నూతన గేటు ఏర్పాటు చేసి పాఠశాల పేరు రాయడానికి బోర్డును ఏర్పాటు చేశారు. పాఠశాల పేరు రాయడానికి దానికి రంగు సైతం వేసి నెలలు గడుస్తున్నా పేరు లేక అడ్మిషన్ సమయంలో స్కూల్ కు వచ్చేవారికి పేరు కనిపించక అయోమయానికి గురవుతున్నారు. స్కూల్ భవనం టెలిఫోన్ ఎక్స్చేంజ్ వెనకాల ఉండడంతో రోడ్డుపైన వెళ్లే వారికి అసలే కనిపించదు కావున నూతనంగా పాఠశాలకు ఏర్పాటుచేసిన బోర్డుకు పాఠశాల పేరు రాసి ప్రజలకు తెలిసేలా పేరు బోర్డును రాయించాలని స్థానికులు కోరుతున్నారు.ం

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

### రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నేర సమీక్షా సమావేశం





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని, ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాట, పీడీఎస్ బియ్యం మళ్లింపు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడ్మిన్ డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## 'సీడ్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జాతీయ డీఎన్‌టీ డెవలప్‌మెంట్ బోర్డ్ కమిటీ సభ్యులు భరత్ బాయ్, ప్రవీణ్ బాయ్




**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** డీఎన్‌టీ(డీనోటిఫైడ్ ట్రైబ్స్) కులాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాతీయ డీఎన్‌టీ డెవలప్‌మెంట్ బోర్డ్ కమిటీ సభ్యులు భరత్ బాయ్, ప్రవీణ్ బాయ్ సూచించారు. బుధవారం హైదరాబాద్ పంజాగుట్టలోని హరిత ప్లాజా హోటల్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ డీఎన్‌టీ కులాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీడ్ పథకం ద్వారా డీఎన్‌టీ కులాలకు విద్య, వైద్యం, ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఆర్థిక అభివృద్ధి తదితర రంగాల్లో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం ద్వారా అందించే ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు జోరిగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎన్‌టీ జాబితాలో మేదరులను చేర్చినందుకు జాతీయ డీఎన్‌టీ డెవలప్‌మెంట్ బోర్డ్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. వెదురుతో తయారు చేసిన జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెంకటరాములు, ప్రధాన కార్యదర్శి ప్యారసాని రమాకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందూరి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కుమార్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలి

- పెద్దపల్లి ఐడీఓసీలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో వైద్య సేవలకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియను అవసరాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పరిసరాలు, వార్డులు, వైద్య గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి తక్షణమే చికిత్స అందేలా చూడాలని తెలిపారు. వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఆసుపత్రుల్లో ఉత్పత్తయ్యే బయోడిగ్రేడబుల్ వ్యర్థాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర స్థాయిలో సమస్య పరిష్కారమయ్యే వరకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా వ్యర్థాలను సురక్షితంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.ఆసుపత్రుల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ వ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే వైద్య సేవల సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, సుల్తానాబాద్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రమాదేవి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్లం టీ జీ ఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

- విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎస్పీ రాజేష్ చంద్ర
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం





**కామారెడ్డి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం లోని బోర్లం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, జూనియర్ కళాశాల (బాలికల)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలను వారు పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీగురుకుల తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినులతో ఒకే చోట కూర్చొని భోజనం చేస్తూ, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అమలు, పరిశుభ్రతపై స్వయంగా తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందేలా చూడాలని, భోజన తయారీ ప్రదేశం, వంట సామగ్రి, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, రికార్డుల పరిశీలన కళాశాలలోని తరగతి గదులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, కళాశాలలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో బోధనా విధానం, బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠాలు, విద్యార్థుల విద్యా ప్రగతి, కళాశాల రికార్డులు, నివేదికలు, విద్యార్థులు సాధించిన ట్రోఫీలను పరిశీలించారు. అధ్యాపకులతో విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా పద్ధతులు, పరీక్షల ఫలితాలపై చర్చించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి కళాశాల ఆవరణ, విద్యార్థినుల వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, మెరుగైన వసతులు అందించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీసీఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు భారీ భద్రతా ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ఎస్పీ


**- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి - ఆగస్టు 16న బిచ్కుందకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**





**కామారెడ్డి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆగస్టు 16న బిచ్కుందకు రానున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆగస్టు 16న బిచ్కుందకు రానున్నారు. బిచ్కుందలోని డీబీఎల్ మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న వివాహ విందు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బిచ్కుందలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సీఎం పర్యటన విజయవంతంగా, ప్రశాంతంగా సాగేలా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. డీబీఎల్ మైదానం, హెలిప్యాడ్ పరిశీలన సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తో కలిసి బుధవారం బిచ్కుందలోని డీబీఎల్ మైదానం, హెలిప్యాడ్ ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమ వేదిక, హెలిప్యాడ్, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు.

# మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి



**ధర్మపురి, ఆగస్టు 12, (ది క్రైమ్ న్యూస్):** మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కులను పంపిణీ చేసినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద ధర్మపురి పట్టణం పురపాలక సంఘ పరిధిలో ఎంపికైన 39 మంది మైనారిటీ మహిళలకు 100 శాతం సబ్సిడీ కింద ఆర్థిక సహాయం మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారురాలికి 50,000 చొప్పున, మొత్తం 19.50 లక్షల నిధులను మంజూరు చేశారు. వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలు, నిరుపేదలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యతనిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్లోజింగ్ లైన్లో సూచించబడిన 1,50,000 విలువైన 3 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి జీవనోపాధికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, ఎంఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ త్రివర్ణ పతాకంతో బిజేపి తిరంగా ర్యాలీ.....






**గన్నేరువరం, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో బిజేపి మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బుదవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గుండ్లపల్లిలోని ఎస్.ఎల్.ఎన్. స్పార్కిల్ పాఠశాల విద్యార్థులు పాల్గొని సుమారు 200 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి రాజీవ్ రహదారిపై నుండి గుండ్లపల్లి వీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..... జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వానికి, ఐక్యతకు, త్యాగాలకు ప్రతీకని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులుగా, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని పేర్కొన్నారు. బీజేపీ మండలా ధ్యక్షుడు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ....హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.పార్టీ సర్పంచ్లు సొల్లు అజయ్ వర్మ, సర్పంచ్ సామా రాజిరెడ్డి, నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి,ఏలేటి చంద్రారెడ్డి,బండి తిరుపతి,బొమ్మాడి సురేందర్ రెడ్డి,పుల్లెల రాము, మచ్చ సాయికృష్ణ, పంబాల రాజశేఖర్,పకిడ మహేందర్, బోయిని అభిషేక్, చొక్కాల లక్ష్మయ్య, కుర్ర హరీష్, ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

# నీట్ జేఈఈలకు లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ

## ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త సి.రాధికా జంగంపల్లి ఇంటర్ పూర్తి చేసిన వెనుకబడిన తరగతుల (బీసీ) విద్యార్థులు జాతీయ స్థాయి వైద్య, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రముఖ వైద్య, ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ అందించనున్నట్లు బీసీ గురుకులాల ఉమ్మడి కామారెడ్డి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త సి. రాధికా తెలిపారు. నీట్-యూజీ, జేఈఈ-2027 ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత లాంగ్‌టర్మ్ రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన, నీట్, జేఈఈ-2026లో మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శిక్షణకు అర్హులు. ఎంపిక విధానం విద్యార్థులకు మెరిట్, సీట్ల లభ్యత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తుల సంఖ్యను బట్టి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదు.రెండు కేంద్రాల్లో శిక్షణ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 16వ తేదీ వరకు కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా బాలికలకు నీట్‌లో 100, జేఈఈలో 40 సీట్లు, బాలురకు నీట్‌లో 50, జేఈఈలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయి.బాలికలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాల, నాగోల్‌లో, బాలురకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాల, అబ్దుల్లాపూర్‌మెట్‌లో లాంగ్‌టర్మ్ శిక్షణ అందించనున్నారు.ఉచిత వసతి, స్టడీ మెటీరియల్ ద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నిపుణులైన అధ్యాపకులతో బోధన, ఉచిత వసతి, స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు ప్రత్యేక ప్రణాళికతో తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. సద్వినియోగం చేసుకోవాలి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బీసీ గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణను బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సి రాధికా. సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని నీట్, జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధించి వైద్య, ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలని ఆకాంక్షించారు.

# ఖని నారాయణ హై స్కూల్ కు 'యాస్పైర్ సమ్మిట్ 3.0'లో ప్రతిష్టాత్మక అవార్డు




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అత్యంత వైభవంగా నిర్వహించిన 'యాస్పైర్ సమ్మిట్ 3.0' లో గోదావరిఖని నారాయణ హైస్కూల్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ స్కూల్' అవార్డును కైవసం చేసుకుంది. హైస్కూల్ విభాగంలో విశేష ప్రతిభ చూపినందుకు గాను పాఠశాలకు ప్రశంసా పత్రంతో పాటు క్యాష్ ప్రైజ్, ప్రత్యేక బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా 2026-27 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులను అద్భుతమైన ఫలితాల వైపు నడిపించిన హైస్కూల్ ఎస్ ఎస్ సి ఉపాధ్యాయుల సేవలను ట్రస్ట్ ప్రత్యేకంగా అభినందించింది. ఉపాధ్యాయుల కృషిని గుర్తిస్తూ వారికి ప్రత్యేక అప్రిసియేషన్ ప్రైజులు, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న నారాయణ సంస్థల డైరెక్టర్ పి. రమ నారాయణ, జి.ఎమ్ గోపాల్ రెడ్డి, డి.జి.ఎం వెంకట రమణారెడ్డి , ఎజిఏం చైతన్య రావు కు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని అవార్డులను స్వీకరించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే విధమైన విద్యా ప్రతిభను కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ. రజినితోపాటుగా, గర్రెపల్లి ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్ రెడ్డి తో పాటు హై స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు లభ్యం



**మధిర ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలోని వైరా ప్రధాన రహదారి సమీపంలో మంగళవారం నాడు ఉదయం లభ్యమైన గుర్తుతెలియని మృతదేహానికి సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో భాగంగా మృతుడిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఖలీమ్ (55)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు, ఖలీమ్ గత కొంతకాలంగా ఉపాధి నిమిత్తం వలస వచ్చి, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఊటుకూరు గ్రామంలో వలస కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు విచారణలో తేలింది. మృతుడికి భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు మరణం పలు అనుమానాలు ఉన్నాయని ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాలలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# ఎంప్లాయిస్ యూనియన్ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు

**ఎంప్లాయిస్ యూనియన్ రానున్న ఎన్నికల్లో బస్సు గుర్తు పై ఓటు వేసి గెలిపించాలి**

**ఈదురు వెంకన్న ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**మధిర ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేసిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్‌కే దక్కుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. రానున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నాడు మధిర లోని ఎంప్లాయిస్ యూనియన్ సమావేశ మధిర లో నిర్వహించిన సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ,ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్‌ను రానున్న ఎన్నికల్లో బస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంప్లాయిస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం ప్రజా భద్రతకు పటిష్ట మైన చర్యలు..

## జిల్లా ఎస్పీ డా. శబరీష్







**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో జిల్లా నేర సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, పోలీస్ అధికారుల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. కేసుల పరిష్కారం.. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి గ్రేవ్ కేసులు, యూ ఐ కేసులు, ప్రాపర్టీ నేరాలు, ఎస్ సి/ఎస్ టి కేసులు, మహిళలు మరియు చిన్నారులపై నేరాల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఐ డి లిక్కర్, ఐ యం ఫ్ ల్ , ఎన్ డి పి ఎస్, నల్లబెల్లం, అక్రమ పి డీఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్ బి డబ్ల్యు ఎస్ అమలు, సమన్ల సకాలంలో జారీ, హిస్టరీ షీట్ల అప్‌డేట్, నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. గుడుంబా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి జిల్లాలో గుడుంబా తయారీ, విక్రయాలు మరియు అక్రమ రవాణాపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. గుడుంబా తయారీ కేంద్రాలు, అనుమానాస్పద ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో తరచూ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలని సూచించారు. గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పాకం, నల్లబెల్లం, ఇతర ముడి పదార్థాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక పోలీస్ సిబ్బంది,వి పి ఓ లు మరియు ఇతర సమాచార వనరుల ద్వారా పక్కా సమాచారం సేకరించాలని ఆదేశించారు. గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు, సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించి గుడుంబా తయారీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, తయారీదారులు మరియు విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. నార్కోటిక్స్‌పై ప్రత్యేక నిఘా జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సరఫరాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానాస్పద ప్రాంతాలు, మాదకద్రవ్యాల వినియోగానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు,ఎన్ డి పి ఎస్ కేసుల్లో సరఫరా గొలుసును గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణ.. ప్రజలకు అవగాహన సైబర్ నేరాలు, ముఖ్యంగా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, ఓ టి పి/కే వై సి మోసాలు, ఫేక్ లింకులు మరియు ఏ ఐ డీప్‌ఫేక్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందిన వెంటనే వేగంగా స్పందించి, బాధితుల నష్టాన్ని తగ్గించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, ఓ టి పి లు, పి ఐ ఎన్ లు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రజలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో నిరంతరం సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ.. నేరాల నియంత్రణ రాత్రి వేళల్లో నేరాలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలు, ప్రధాన రహదారులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలు, సున్నితమైన ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో సమర్థవంతంగా గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలను తనిఖీ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతికతతో ఆధునిక పోలీసింగ్ నేరాల నియంత్రణలో సి సి టి వి కెమెరాల నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని, పోలీస్ స్టేషన్లకు సంబంధించిన అన్ని వివరాలను సి సి టి ఎన్ ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వివిధ కమిషన్లకు సంబంధించిన పెండింగ్ పిటిషన్లను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయి నిఘా.. వేగవంతమైన స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేసి గ్రామస్థాయిలో నేర సమాచారం సేకరణను పెంచాలని, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహన తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో గుడుంబా, మాదకద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాలు మరియు ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం సేకరించి, అందిన సమాచారంపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. డయల్–112/100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు డ్యూటీ అధికారులకు ప్రశంసా పత్రాలు కేసుల దర్యాప్తుతో పాటు న్యాయస్థానాల్లో సమర్థవంతమైన సమన్వయం, ప్రాసిక్యూషన్‌కు సహకారం అందిస్తూ నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన కోర్ట్ డ్యూటీ అధికారులను జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచి కేసుల్లో కన్విక్షన్స్ సాధించేందుకు కృషి చేసిన కోర్ట్ డ్యూటీ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించి, కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు మరియు సమర్థవంతమైన కోర్టు ఫాలోఅప్ ద్వారా న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. "ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన.. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు.. ప్రతి నేరంపై సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్.. ప్రతి పౌరుడికి పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించడమే పోలీస్ శాఖ లక్ష్యం అని ఎస్పీ తెలిపారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు - విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపు**








**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంతో పాటు విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ బృందం ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ అధ్యాపకులకు బోధనా నైపుణ్యాలు, ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను అధ్యాపకులు తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధనా విధానాలను అవలంబించాలని అధ్యాపకులకు సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత పెంపొందేలా బోధన కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ప్రతి విద్యార్థి తనకు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షల్లో రాణించేలా అధ్యాపకులు విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు అధ్యాపకులు అందిస్తున్న బోధన, మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సలామ్, హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షణ బృందం సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తా

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి, ఆగస్టు 12, (ది క్రైమ్ న్యూస్):** ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో వారు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని, ఈ అంశాన్ని రానున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సంఘం ప్రతినిధులు మంత్రిని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫీల్డ్ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్న తమకు పే స్కేల్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. వారి సమస్యలను క్యాబినెట్‌లో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అన్ని విధాలా న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై తన లెటర్ ప్యాడ్‌పై ముఖ్యమంత్రికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కి, పంచాయతీరాజ్ కమిషనర్‌కి ప్రత్యేకంగా లేఖలు రాస్తానని మంత్రిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం రాజా గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు గౌడికర్ శ్రీనివాస్, గోనెపల్లి మహేష్, సాతర్ల బాలరాజ్, మార్కాపురం అశోక్, మామిడి అనిత, మల్లేశం రవి, సుజాత, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రకాష్, భీమన్నతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లావ్యాప్తంగా ఉన్నఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఐక్యమత్యానికి ప్రతీక వందేమాతరం

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** ఐకమత్యానికి ప్రతీక వందేమాతర గీతం అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండల కేంద్రంలో ని అంగడి బజార్ వద్ద ప్రముఖ డ్యాన్సర్ ఒ కొరియోగ్రాఫర్ పులిపాక దేవా ఆధ్వర్యంలో రూపొందించిన వందేమాతరం పాటను తహసిల్దార్ ముస్త్యాల వాసంతి ఎంపీడీవో సాధినేని ప్రియాంక ఆర్ ఐ స్రవంతి గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు, పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. మాతృత్వానికి ప్రతీక వందేమాతర గీతం అని కులమతాల కు అతీతంగా ఆలపించే గీతం వందేమాతరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్ మాట్లాడుతూ.. వందేమాతరం గీతంలో తాను నటించడంనాపూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. అలాగే ఈ పాట మొత్తం గుండారం పరిసర ప్రాంతాల్లో తీయడం జరిగిందని దీనికిగాను కళాకారులు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. అలాగే పాటలో దాసరి రామస్వామి, జబ్బార్ ఖాన్ వీర్ల ప్రశాంత్, మ్యాజిక్ శశి, తజావత్ పవన్ కళ్యాణ్, ఆసంపల్లి సౌమ్య, మడిపోజు మౌనిక, మరి పోజు మానస, గుగులోతు ఝాన్సీ, శివ, నటించడం జరిగిందని పేర్కొన్నారు. కెమెరామెన్ గా ఉప్పు నారాయణ వహించగా ఎడిటింగ్ మెహబూబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోయడ సతీష్,దాసరి పల్లె ఉపసర్పంచ్ సతీష్, కార్యదర్శి బచ్చల ప్రసాద్,దామెర దేవయ్య, స్మ్రాట్ రాజేష్, లల్లు, నగునూరి నరసయ్య, మెడగొని శ్రీనివాస్, కళాకారులు దాసరి రామస్వామి, జబ్బార్ ఖాన్, మడిపోజు మానస, కాంపల్లి సౌమ్య ప్రజలు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ల పట్టివేత... నిందితులపై కేసు నమోదు

**మానకొండూర్, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సదాశివపల్లికి చెందిన సాతినేని దేవరాజు(26),ముంజంపల్లికి చెందిన లింగాల రాజేందర్ రెడ్డి(31) అనే ఇద్దరు వ్యక్తులు సదాశివపల్లి నుండి తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను కరీంనగర్ తరలిస్తుండగా సదాశివపల్లి వద్ద ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ పి.శ్రీలత హెచ్చరించారు.

# మానవత్వం చాటిన నాంపల్లి చంద్రమ్మ ఫౌండేషన్

## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదకు రూ.5 వేల ఆర్థిక సాయం



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన అమురాజి స్వామికి నాంపల్లి చంద్రమ్మ ఫౌండేషన్ అండగా నిలిచింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న స్వామి పరిస్థితిని తెలుకుంట సర్పంచ్ నాంపల్లి సంపత్ కుమార్ ఫౌండేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన నాంపల్లి చంద్రమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు నాంపల్లి స్వామి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందించిన ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అమురాజి స్వామి కుటుంబ సభ్యులు నాంపల్లి ఫౌండేషన్ అధ్యక్షులు నాంపల్లి స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవలో భాగంగా పేదలు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులతో పాటు తెలుకుంట సర్పంచ్ నాంపల్లి సంపత్ కుమార్, జూలపల్లి మండల ఫోరం అధ్యక్షులు తోగురి శ్రీనివాస్, అబ్బాపూర్ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు, భోంగాని వీరేశం, కచ్చు భీరయ్య, కొమ్మ రాజయ్య, చోప్పారి కనుకయ్య, నల్లాల నాగరాజు, అమురాజి కొండయ్య, అమురాజి చిన్నస్వామి తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పేరుగాంచిన పేదల ఆసుపత్రిలో.. రోగికి నేలే బెడ్డు

**- బెడ్డు దొరకదు.. వైద్యం అందదు.. నేలపైనే ప్రాణ పోరాటం - వరంగల్ ఎంజీఎంలో వైద్య సేవల దుస్థితికి అద్దం పడుతున్న దృశ్యం - ఎమర్జెన్సీ చికిత్స కోసం కుటుంబ సభ్యుల వేడుకోళ్లు- అయినా పట్టించుకోని సిబ్బంది! - దిక్రైమ్ న్యూస్ స్పెషల్ స్టోరీ...**



ఎమర్జెన్సీ వార్డు ముందు పరిస్థితి ఇలా

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్య సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పడానికి ఈ ఒక్క దృశ్యం చాలు. సీజనల్ వ్యాధులతో తీవ్ర అనారోగ్యంతో నిలబడలేని స్థితిలో ఆసుపత్రికి చేరుకున్న ఓ రోగికి తక్షణ వైద్యం అందించాల్సింది పోయి.. ఆసుపత్రి బయటే పడుకోబెట్టిన దృశ్యం కలచివేస్తోంది. ఎమర్జెన్సీలోకి తీసుకెళ్లి చికిత్స అందించాలంటూ కుటుంబ సభ్యులు సెక్యూరిటీ సిబ్బందిని వేడుకున్నా అనుమతించలేదని వారు ఆరోపిస్తున్నారు. "బెడ్లు ఖాళీ లేవు" అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చి రోగిని బయటే ఉంచారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. బెడ్లు లేకపోతే ప్రత్యామ్నాయ వైద్యం చూపించాలి. కనీసం అత్యవసర చికిత్స అందించాలి. కానీ ప్రాణాలతో పోరాడుతున్న రోగిని ఇలా నేలపై వదిలేయడం ఎంతవరకు సమంజసం, ఈ దృశ్యాన్ని చూసి బెడ్ లేదా.. లేక మానవత్వం కూడా లేదా?అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు చివరి ఆశ్రయం. అదే ఆసుపత్రి గుమ్మం వద్దే రోగి ఇలా పడుకోవాల్సి వస్తే.. వైద్య వ్యవస్థ ఎవరి కోసం? గుమ్మం దాటలేని పేదల ప్రాణాలు ఎవరి బాధ్యత? వైద్యం కోసం వచ్చే ప్రతి రోగికి గౌరవంగా, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందేలా చర్యలు ఉండాలి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నిరుపేదలకు వైద్య సేవలు అందించే ఏకైక పెద్ద దిక్కయిన ఎంజీఎం లాంటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బెడ్లు లేవన్న సాకుతో ప్రాణాలను బయటే వదిలేయడం వైద్య సేవ కాదు.. మానవత్వానికే మచ్చ. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అలుగునూరు సిఓఈలో గ్రంథపాలకుల దినోత్సవం



**తిమ్మాపూర్, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్‌జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు సిఒఈ కళాశాలలో బుధవారం గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వెసి ఘనంగా నివాళు లర్పించారు. గ్రంథాలయ విశిష్టత, గ్రంథ పాలకుల ప్రాముఖ్యతను విద్యార్థినిలకు ప్రిన్సిపాల్ మాదవి వివరించారు.అనంతరం పలువురు విద్యార్థినులు వివిధ అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చారు. ఉపాద్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ రైస్ సరఫర గడువు లోగా పూర్తి చేయాలి

## సిఎంఆర్ రైస్ డెలివరీ పై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రబీ 2024-25 సీజన్ కి సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ బి శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో సిఎంఆర్ రైస్ డెలివరీ పై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, రబీ 2024-25 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సకాలంలో అందించాలని, సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.జిల్లాలోని రైస్ మిల్లులలో ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారం రా రైస్, పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన సి.ఏం.ఆర్. ను గడువు లోగా పూర్తి చేయుటకు ఎఫ్.సి. ఐ అధికారులకు సూచించారు.రైస్ మిల్లర్లకు సంబంధించి రోజువారీగా రిజిస్టర్ నమోదు చేయాలని, గన్ని సంచుల కోతలు, నెంబర్స్ నమోదు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దూలపల్లి మార్కెట్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూపాలి

**● ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోరిన ప్రజాప్రతినిధులు**



**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) కొంపల్లి, ఆగస్టు 12:** దూలపల్లి ప్రధాన గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు మార్కెట్‌ను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామ ప్రజలు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మార్కెట్ కారణంగా అశోక వైపు నుంచి గంగస్థాన్‌కు వెళ్లే ప్రధాన రహదారితో పాటు అనిల్ ఫోటో స్టూడియో నుంచి ఎన్‌టీఆర్ విగ్రహం చౌరస్తా మీదుగా గ్రామంలోకి వెళ్లే మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ప్రతి శుక్రవారం వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, వైద్య సేవల వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పోచమ్మ ఆలయం--హనుమాన్ ఆలయం వైపు మార్కెట్‌ను పూర్తిగా తొలగించకుండా పోచమ్మ దేవాలయం సమీపంలోని 40 అడుగుల రహదారి నుంచి హనుమాన్ దేవాలయం వైపు, కృష్ణానగర్ రోడ్డుకు అనుసంధానమయ్యే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ పార్కింగ్‌కు అవకాశం ఉండటంతో వ్యాపారులు కూడా సౌకర్యంగా వ్యాపారం చేసుకునే వీలుంటుందని తెలిపారు. మార్కెట్ తరలిస్తే ప్రధాన గ్రామంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి అత్యవసర వాహనాల రాకపోకలకు మార్గం సుగమమవుతుందన్నారు. ఈ మేరకు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ డి.లావణ్యకు వినతిపత్రం అందజేసి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజల సౌకర్యం, భద్రతకు సంబంధించిన అంశమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# ప్రతి పోలీస్ వాహనంలోనూ భద్రతా సామగ్రి ఉండాలి: సీపీ అంబర్ కిషోర్ ఝా

**● కమిషనరేట్‌లో పోలీస్ వాహనాల నిర్వహణపై సీపీ ఆకస్మిక పరిశీలన ● డ్రైవర్లు వాహనాలను సొంత వాహనాల మాదిరిగా చూసుకోవాలని సూచన**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు చెందిన వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా, ప్రజలకు అందించే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వాహనాల్లోని సమాచార ప్రసార పరికరాల పనితీరును పరిశీలించారు. అదేవిధంగా ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు, ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు, రక్షణ సామగ్రి కిట్‌లో భాగంగా హెల్మెట్, రాళ్ల దాడి నుంచి రక్షణ కవచం, లాఠీ, శరీర రక్షణ కవచం, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వాహనాల నిర్వహణలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ప్రతి నెలా సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సొంత వాహనాల మాదిరిగా జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్ణీత వ్యవధిలో వాహనాల మరమ్మతులు, ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

# కిమ్స్‌లో సైబర్ నేరాలపై అవగాహన...





**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) కొంపల్లి, ఆగస్టు 12:** సురక్షా తిరంగా కార్యక్రమంలో భాగంగా పెట్‌బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో కొంపల్లిలోని కిమ్స్ ఆసుపత్రిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ జోన్ అదనపు డీసీపీ పురుషోత్తం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సైబర్ నేరాల తీరుతెన్నులు, పెట్టుబడి, ట్రేడింగ్, ఆన్‌లైన్ డేటింగ్, స్మిషింగ్, ఏపీకే ఫైళ్లతో మోసాలు, నకిలీ వ్యక్తుల పేరుతో మోసాలకు పాల్పడే విధానాలను పోలీసులు వివరించారు. మొబైల్ ఫోన్ పోయినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలను తెలియజేశారు. అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద పెట్టుబడి ఆఫర్లు, వ్యక్తిగత వివరాలు కోరే ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో 10 మంది వైద్యులు, 50 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పెట్‌బషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్, డీఐ డి. అజయ్‌కుమార్, సైబర్ వారియర్ వి. హరీష్ (రాజ 6941) కార్యక్రమాన్ని నిర్వహించారు.

# బాలాజీనగర్‌లో వ్యక్తి ఆత్మహత్య



**మేడ్చల్ , ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** బాలాజీనగర్ మార్కెట్ లైన్‌కు చెందిన గడ్డం ఆంజనేయులు (36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు గత మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ డ్రైవింగ్‌కు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటుపడ్డాడు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఆంజనేయులు భార్య గడ్డం ప్రేమలత పనికి వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి ప్రధాన ద్వారానికి లోపల, బయట నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో ఇంటి మరోవైపు ఉన్న సందులోని తలుపును తెరిచి లోపలికి వెళ్లి చూడగా కిచెన్‌లోని స్లాబ్‌కు ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆంజనేయులు వేలాడుతూ కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీతారామ ఆలయంలో కళాకారుల ప్రత్యేక పూజలు...




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** గాజులరామారం సీతారామ ఆలయంలో కళాకారులు హేమంత్, శంకర్, నర్సింహులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు కళాకారులకు స్వాగతం పలికారు.

# తమ కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని

**వివాహ ఆహ్వాన పత్రికను మంత్రి సీతక్కకు అందజేశారు**

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి తోట అర్చన**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా జూకల్ నియోజకవర్గం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి తోట అర్చన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఓ గ్రామీణాభివృద్ధి, మహిళా ఓ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్కకు) హైదరాబాద్‌లోనితన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను సీతక్కకు అందజేశారు. సీతక్క ఆహ్వాన పత్రికను సాదరంగా స్వీకరించి, నూతన వధూవరులకు ముందస్తు శుభాకాంక్షలు, ఆశీస్సులు తెలియజేశారు.

# కల్వచర్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా వన మహోత్సవం



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజ రాణి, గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి కలిసి 120 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.అనంతరం వారు మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వృక్షాలు మన జీవనాధారమని, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఏ పి ఓ మౌనిక, ఏ పి ఎం పద్మ,ఫీల్డ్ అసిస్టెంట్ కొమురయ్య,ఆలయ కమిటీ చైర్మన్ రేండ్ల కుమారస్వామి,వార్డు సభ్యులు రేండ్ల కుమారస్వామి,గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేస్తామని చెప్పారు.

# కొత్త బెల్లం కంటే పాత బెల్లం వెయ్యిరెట్లు మంచిదట.. మీరూ తినండి ఎన్ని లాభాలో!

తాజా బెల్లం తినడం చాలా మందికి ఇష్టం. అయితే కొత్త బెల్లం కంటే పాత బెల్లం ఎక్కువ మేలు చేస్తుందని మీకు తెలుసా..? అవును.. ఆశ్చర్యంగా అనిపించినా ఇది పోషకాహార నిపుణులు చెబుతున్న మాట. నేటి నుంచి వంటగదిలో కొత్త బెల్లానికి బదులు పాత బెల్లాన్ని వాడటం ప్రారంభించండి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 1 నుండి 2 సంవత్సరాల కాలంపాటు నిల్వ చేసిన బెల్లం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. సుదీర్ఘ కాలంలో బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్, పోషక విలువలు పెరుగుతాయి. ఇది మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. కాబట్టి 1 నుంచి 2 సంవత్సరాలలోపు పాత బెల్లం తీసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులోని మొలాసిస్‌ను వివిధ పోషకాలను అందిస్తుంది. పాత బెల్లం దుకాణాల్లో దొరుకుతుంది. కానీ దీని ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. బెల్లం అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. బెల్లం మన జీర్ణక్రియను అనేక విధాలుగా మెరుగుపరుస్తుంది. బెల్లంలో అనేక రకాల ఎంజైమ్‌లు, ఫైబర్‌లు ఉంటాయి. ఇవి ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. బెల్లం ఎముకల ఆరోగ్యానికి కావల్సిన ముఖ్యమైన కాల్షియం, ఫాస్పరస్ వంటి ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది.

# సింగిల్ విండో చైర్మన్లుగా ఒగ్గు దామోదర్, ఊట్కూరి వెంకటరమణారెడ్డి



**మానకొండూర్, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతన పాలకవర్గం నియామిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బెజ్జంకి సహకార సంఘ చైర్మన్ గా ఒగ్గు దామోదర్, డైరెక్టర్లుగా చెట్టి రాజు, నూనె రాజేందర్, కట్ట స్వరూప, అద్దంకి నర్సింగం, గంగాధర రామచంద్రం, కెడిక అపర్ణ, బైర రాజేందర్, తుమ్మ సుధాకర్ రెడ్డి, మాషం శంకర్, లింగాల రామవ్వ, కొమ్మెర తిరుపతి, కుక్కల రాములు నియామకమయ్యారు. ఇల్లంతకుంట సహకార సంఘ చైర్మన్‌గా ఊట్కూరి వెంకట రమణారెడ్డి, వైస్ చైర్మన్ గా యాస తిరుపతి, డైరెక్టర్లుగా సొల్లు కవిత, ఉప్పుల సంజీవరెడ్డి, సింగిరెడ్డి లక్ష్మి, కేతిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, కోనేటి నర్సయ్య, ముక్కిస ఎల్లారెడ్డి, గుండా వెంకటేశం, ఎలుక అనిల్ కుమార్, ఏలేటి మాధవరెడ్డి, జాప బాల్ రెడ్డి, ఒగ్గు రమేశ్ నియామకయ్యారు.

# కల్వచర్ల పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

**డాక్టర్ నామని సునీత, డాక్టర్ నామని సత్యనారాయణ దంపతులు**



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని పోచమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని డాక్టర్ నామని సునీత, డాక్టర్ నామని సత్యనారాయణ దంపతులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం గ్రామ ప్రజలతో కలిసి పనిచేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి సేవాభావాన్ని అభినందిస్తూ కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి దంపతులు గ్రామ ప్రజలు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం డి మంజూరు, కొంక పోచయ్య, బొంకురి పోచం, రేండ్ల కుమారస్వామి, మల్యాల మోహన్, నూనే సారయ్య, జపతి శేఖర్, ఐట్ల రాజేశం, వేముల వెంకటేశ్వర్లు, రౌతు శివపటేల్, మెండ రాజమౌళి, ఇరుగురాల సంతోష్, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత ఆశయాల లక్ష్యాల పై నాటక ప్రదర్శన

**రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం**



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి సంస్థ ఆర్జీత్రీ, ఎ.పి.ఎ ఏరియా ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ వారిచే సెంటినరీ కాలనీ, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం లోని సి.ఇ.ఆర్ క్లబ్ నందు ఆగస్టు 13 గురువారం సాయంత్రం 6 గంటల నుండి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత ఆశయాల లక్ష్యాల పై సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శన నిర్వహించబడునని, కావున అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, కాలనీ వాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై ఈ నాటక ప్రదర్శన వీక్షించగలరని రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం కోరారు.

# పలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌కి వినతి

**సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు**



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు కోరారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు కలిసి పలు వినతిపత్రాలు అందించారు. రత్నాపూర్ టు రామగిరిఖిల్లా వరకు రోడ్డు వేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరగా నిధులు మంజూరు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ముందుగా గ్రామంలో రోడ్డు వెడల్పు చేసి తీర్మాణం తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. లక్ష్మీనగర్ ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజిలకు రూ.కోటి కేటాయించిన పనులను త్వరగతిన ప్రారంభం అయ్యేలా చూడాలని కలెక్టర్ అన్నారు. వివిధ అభివృద్ధి పనులకు కూడా నిధుల మంజూరు కు కూడా హామీ ఇచ్చారు.

# ఇంటింటా మొక్కలు పెంచాలి.... కాలుష్యం నివారించాలి

**సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు**



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** ప్రతి ఒక్కరూ ఇంటింటా మొక్కలు పెంచాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు కోరారు. రత్నపూర్ గ్రామంలో బుధవారం మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఇంటికి ఉసిరి, మందార, గన్నేరు, తంగేడు, కదంబం తదితర 6 మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఇంటి ఆవరణలో ఈ మొక్కలు పెంచాలని కోరారు. దీనికి తోడు ఇంటి ఆవరణలో కూరగాయల మొక్కలు పెంచి కూరగాయలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, కార్యదర్శి గంగుల సంతోష్, వార్డు సభ్యులు కలవేన రవి, అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, కారొబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి హార్దిక్ పాండ్యా?

ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ ట్రేడింగ్ గురించి పూటకో వార్త తెరపైకి వస్తుంది. పేలవ ప్రదర్శన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమవ్వగా.. అతన్ని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఆయా ఫ్రాంచైజీలతో ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోజుకో ఫ్రాంచైజీలో హార్దిక్ పాండ్యా చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ముందుగా చెన్నై సూపర్ కింగ్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్స్ జరిపిన ముంబై ఇండియన్స్ ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, కేకేఆర్‌తో చర్చలు జరిపినట్లు ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడని, అతన్ని తీసుకునేందుకు ఆఫ్రాంచైజీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ అడగడంతో అతని ట్రేడ్ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఎక్స్ వేదికగా హార్దిక్ పాండ్యా ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ షేర్ చేయడం ఈ వార్తలకు బలం



చేకూరుస్తోంది. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ఆల్‌రౌండర్ మిన్ను మణి కూడా సీఓఈలోనే రిహాబిలిటేషన్ తీసుకుంటుంది. ఈ సందర్భంగా అక్కడే ఉన్న హార్దిక్ పాండ్యాతో కలిసి ఫొటో దిగింది. ఈ ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ ఎక్స్ వేదికగా పంచుకుంది. 'ఇద్దరు భారత ఆల్‌రౌండర్లు కలుసుకున్నారు'అని క్యాప్షన్‌గా పేర్కొంది. దాంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఒకవేళ హార్దిక్ పాండ్యా ఢిల్లీకి ట్రేడ్ అయితే అతనికి బదులు కేఎల్ రాహుల్‌తో పాటు ఓ బౌలర్‌ను ముంబై అడగవచ్చు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు అనుభవం కలిగిన కెప్టెన్ అవసరం ఉంది. హార్దిక్ పాండ్యాతో ఆ లోటును తీర్చుకోవాలనే యోచనలో ఢిల్లీ ఉంది. హార్దిక్ పాండ్యా అరంగేట్ర సీజన్‌లో ముంబై ఇండియన్స్ విజేతగా నిలిచిందని, గుజరాత్ టైటాన్స్‌కు కూడా అతను టైటిల్ అందించాడని, ఇప్పుడు ఢిల్లీకి అందివ్వబోతున్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

## కుల్‌దీప్‌కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి


### టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తిక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.



## సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు

టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతో సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది.సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది.సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



## దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

### భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్

దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడని భారత ఆటగాళ్ల పట్ల బీసీసీఐ కఠినంగా వ్యవహరించాలని సూచించాడు. గత రెండేళ్లుగా స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంలో టీమిండియా తడబడుతోంది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకనే టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతుల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. అయితే టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర వైఫల్యానికి స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకపోవడమే ప్రధాన కారణమని కపిల్ దేవ్ అన్నాడు. అగ్రశ్రేణి ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండటంతోనే స్పిన్ బౌలింగ్‌ను సరిగ్గా ఆడలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు. 'దేశవాళీ క్రికెట్ ఆడటం చాలా ముఖ్యం. టాప్ క్లాస్ ప్లేయర్లు తగినంతగా దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే భారత జట్లు స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయంలో బీసీసీఐ కఠినంగా వ్యవహరించి అందరూ దేశవాళీ రెడ్ బాల్ క్రికెట్ ఆడేలా చూడాలి. దాంతో టాప్ క్లాస్ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం కుర్రాళ్లకు లభిస్తోంది. ఈ మధ్య భారత్ ఎక్కువగా టీ20లు, వన్డేలు ఆడుతోంది. టెస్ట్ క్రికెట్ పూర్తిగా భిన్నమైనది. ఈ సమస్యను అధిగమించడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనాలి. టీ20 మ్యాచ్‌లు పెరిగినందున పేసర్లు గాయాల బారిన పడకుండా వారి వర్క్‌లోడ్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టాలి.'అని సూచించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్టల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లింది. ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ మొదలవ్వనుంది. గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేయాలి.

## పోర్చుగల్ టీ20 జట్టు కెప్టెన్‌గా మోసెస్ హెన్రిక్స్

క్రికెట్ ప్రపంచంలో ఆస్ట్రేలియా తరఫున సుదీర్ఘ కాలం పాటు ఆల్ రౌండర్‌గా సేవలందించిన మోసెస్ హెన్రిక్స్ తన కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమైన రెండో అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఇన్నాళ్లు ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడిన అతడు.. ఇప్పుడు మరో దేశ జాతీయ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఈ మేరకు పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హెన్రిక్స్‌ను నియమిస్తూ పోర్చుగల్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. అతడి సారథ్యంలోనే పోర్చుగల్ జట్టు 2028 టీ20 వరల్డ్ కప్ యూరప్ సబ్-రీజినల్ క్వాలిఫయర్ 'సి'లో తలపడనుంది. ఫిన్‌లాండ్ వేదికగా ఆగస్టు 14 నుంచి 21 వరకు ఈ టోర్నీ జరగనుంది. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో జన్మించిన పోర్చుగల్‌లోని 'మదీరా' దీవిలోనే హెన్రిక్స్ జన్మించాడు. చిన్నతనంలో కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 4 టెస్టులు, 16 వన్డేలు, 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు మోసెస్ హెన్రిక్స్. న్యూ సౌత్ వేల్స్, బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ తరఫున ఆడాడు. అంతేకాకుండా సిడ్నీ సిక్సర్స్ జట్టుకు వరుసగా 2019-20, 2020-21 సీజన్లలో కెప్టెన్‌గా టైటిళ్లు సాధించి పెట్టాడు. 2021లో బంగ్లాదేశ్‌తో ఆసీస్ తరఫున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్ పూర్తి చేసుకుని పోర్చుగల్ తరఫున ఆడే అర్హత సాధించాడు. గత నెలలోనే ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన 39 ఏళ్ల హెన్రిక్స్, తన జన్మభూమి అయిన పోర్చుగల్‌కు ఆడాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు. అయితే కేవలం ఆటగాడిగానే కాకుండా బోర్డు అతనికి ఏకంగా జట్టు నాయకత్వ పగ్గాలను అప్పగించింది.ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ టోర్నీ ఫైనల్ గెలిచిన జట్టు యూరోపియన్ రీజినల్ క్వాలిఫయర్ రౌండ్‌కు చేరుకుంటుంది. అక్కడ స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్ వంటి బలమైన జట్లతో పోటీపడి టాప్-2లో నిలిస్తే గ్లోబల్ క్వాలిఫయర్ ద్వారా 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగబోయే ప్రధాన టీ20 వరల్డ్ కప్‌నకు పోర్చుగల్ అర్హత సాధించవచ్చు. బిగ్‌బాష్ లీగ్, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న మోసెస్ హెన్రిక్స్ సారథ్యంలో అసోసియేట్ దేశమైన పోర్చుగల్ క్రికెట్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల

భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది.అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక




ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

# జైలు గోడల మధ్య చదువుల వెలుగు.. 78 మంది ఖైదీలు పాస్

● ఎన్ఐఓఎస్ ద్వారా తొలిసారి పదో తరగతి ఉత్తీర్ణత ● 78 మందికి డీజీ రిమిషన్.. మరో 47 మంది కొత్తగా నమోదు






**మేడ్చల్, ఆగష్టు 12(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ జైళ్ల చరిత్రలో తొలిసారిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. ఖైదీల విద్య, పునరావాసం, సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేయడంలో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ ఎన్ఐఓఎస్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం అనంతరం చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్, హైదరాబాద్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్ నుంచి 108 మంది ఖైదీలు ఎస్ ఎస్ సి కోర్సులో నమోదు చేసుకున్నారు. వీరి చదువుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి వారి వేతనాలను జైళ్ల శాఖ భరించింది. ఏడాది పాటు రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డు పరీక్షలు నిర్వహిస్తూ జైలు అధికారులు, ఉపాధ్యాయులు ఖైదీలకు మార్గనిర్దేశం చేశారు. దీంతో చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 56 మంది, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 15 మంది, హైదరాబాద్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్‌కు చెందిన ఏడుగురు కలిపి మొత్తం 78 మంది ఎస్ ఎస్ సి పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఖైదీలకు సులభంగా అర్థమయ్యేలా, భవిష్యత్తులో ఉపాధి, జీవనోపాధికి ఉపయోగపడేలా పాఠ్యాంశాలను ఎంపిక చేయడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. ఉత్తీర్ణులైన ఖైదీలకు తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను అధిగమించాలనే సంకల్పాన్ని ఆమె ప్రశంసించారు. విద్య ద్వారా జీవితంలో సానుకూల మార్పు తీసుకురావాలని, భవిష్యత్తులోనూ చదువును కొనసాగించి తమకు, కుటుంబాలకు గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఎన్ఐఓఎస్ ద్వారా ఎస్ ఎస్ సి ఉత్తీర్ణత సాధించిన 78 మంది ఖైదీలకు విద్యపై చూపిన క్రమశిక్షణ, నిబద్ధతకు గుర్తింపుగా డైరెక్టర్ జనరల్ రిమిషన్ ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఈ నిర్ణయం ఇతర ఖైదీలు కూడా విద్యను కొనసాగించేందుకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఎస్ ఎస్ సి ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ఐఓఎస్ ద్వారా సీనియర్ సెకండరీ (10o2) విద్యను కొనసాగించేలా ప్రోత్సహించనున్నారు. మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్ ఎస్ సి విద్యలో నమోదు చేసుకున్నారు. 10o2 పూర్తి చేసిన అనంతరం చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా అండర్‌గ్రాడ్యుయేట్ బీఏ కోర్సుల్లో చేరే అవకాశం కల్పించనున్నారు. అదేవిధంగా ఎస్ ఎస్ సి లో ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లో ఏర్పాటు చేసిన ఐటి లో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులని డా. సౌమ్య మిశ్రా తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుని భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకుని స్వయం ఆధారిత జీవితం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్య లేకపోవడం వల్ల జీవితంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, ఆత్మవిశ్వాసం తగ్గిపోయిందని, సమాజంలో తగిన గౌరవం లభించలేదని కొందరు తెలిపారు. ఓ ఖైదీ భవిష్యత్తులో ఎల్ ఎల్ బి వరకు చదివి న్యాయవాదిగా మారి పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. మరో ఖైదీ చిన్ననాటి నుంచే సరైన విద్య అందివుంటే తన జీవితం మరోలా ఉండేదని, బహుశా జైలుకు వచ్చే పరిస్థితి కూడా ఏర్పడి ఉండకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని ఖైదీలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో సహకరిస్తున్న ఎన్ఐఓఎస్ కు డా. సౌమ్య మిశ్రా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎన్ఐఓఎస్ రీజినల్ డైరెక్టర్ పరంప్రీత్ సింగ్, ఎన్ఐఓఎస్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్ అందిస్తున్న నిరంతర సహకారాన్ని అభినందించారు. ఖైదీల విద్యా ప్రయాణంలో ప్రోత్సహించి, మార్గనిర్దేశం చేసిన జైలు అధికారులు, ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, విద్యా సమన్వయకర్తలు, సిబ్బంది కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్ఐఓఎస్ జాయింట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ పరంప్రీత్ సింగ్, ఎన్ఐఓఎస్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ వై. రాజేష్, హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ డా. డి. శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎం. సంపత్, చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్ సూపరింటెండెంట్ జి. ప్రమోద్, ప్రిజనర్స్ అగ్రికల్చరల్ కాలనీ సూపరింటెండెంట్ డి. భారత్, హైదరాబాద్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్ సూపరింటెండెంట్ లక్ష్మీ శ్రీనాథ్, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్ సూపరింటెండెంట్ పి. అశోక్ కుమార్, ఇతర సీనియర్ జైలు అధికారులు, ఎన్ఐఓఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.






# మీకు డయాబెటిస్ ఉందా..?

## రోజుకు రెండుసార్లు ఇలాంటి టీ తాగండి చాలు..!



పాలు, చక్కెర కలిపి తయారు చేసిన టీ తాగటం మానేస్తే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్న మాట. కానీ, డయాబెటిక్ పేషెంట్లు టీ ఎలా తాగాలో ప్రత్యేకించి చెబుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ డైట్ విషయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. షుగర్ లెవల్స్ మెయింటెయిన్ చేయడం తప్పనిసరి అంటున్నారు. షుగర్ బాధితులు దూరంగా ఉండాల్సిన ఆహారాల్లో టీ కూడా ఒకటి. ఇందులో పాలు, పంచదార ఉన్నందున దీనిని నివారించడం మంచిదని చెబుతున్నారు.. కానీ, డయాబెటిక్ పేషెంట్లు ఎలాంటి టీ తాగితే మేలు చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం.. 1. గ్రీన్ టీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఆరోగ్యకరమైన టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీలోనిపాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతే కాదు, గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 2.దాల్చిన చెక్క టీ దాల్చిన చెక్క టీ మధుమేహాన్ని నియంత్రించడంలో ఉత్తమమైనది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క టీ చేయడానికి, ఒక కప్పు నీటిలో దాల్చిన చెక్క చిన్న ముక్క వేసి కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత టీకి బదులుగా తాగేయాలి. 3. మెంతి టీ డయాబెటిక్ బాధితులకు మెంతి టీ మరొక గొప్ప ఎంపిక. మెంతులలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. మెంతి టీ చేయడానికి, ఒక కప్పు వేడి నీటిలో ఒక చెంచా మెంతులు వేసి 10 నిమిషాలు అలాగే పక్కన పెట్టి తాగేయండి. రుచి కోసం కావాలంటే మీరు నిమ్మరసం కూడా యాడ్ చేసుకోవచ్చు. 4. వాముతో తయారు చేసిన టీ వాము జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వాము టీ తయారు చేయడానికి ఒక గ్లాస్ నీటిలో పావు చెంచా వాము వేసి 5 నిమిషాలు మరిగించండి. కాస్త ఆ తర్వాత వడకట్టి తాగాలి. 5. తులసి టీ తులసి టీలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని కోసం, ఒక కప్పు వేడి నీటిలో కొన్ని తులసి ఆకులను వేసి 5 నిమిషాలు మూత పెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత రుచి కోసం కొంచెం తేనె కలుపుకుని తాగేయొచ్చు. చివరగా, మధుమేహులు ఇలాంటి టీ తాగుతున్నప్పుడు దానికి చక్కెర, లేదా తేనె కలుపుకోవడం మంచిదికాదు. రుచి కోసం కావాలంటే మీరు దాల్చినచెక్క పొడి లేదా ఏలకుల పొడి వేసుకుని తాగొచ్చు. మరీ ముఖ్యంగా ఇలాంటి ఇంటి చిట్కాలు, ఆయుర్వేద మందులు వాడే ముందు..మీరు మీ వైద్యుడిని సంప్రదించండి. దీనితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహాలను అనుసరించడం చాలా ముఖ్యం.

## గుండె సమస్యలకు దానిమ్మ రసం దివ్యౌషధం..

# రోజుకి గ్లాసుడు తాగితే చాలు!



ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో నిండిన దానిమ్మ పండు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున్న శరీర కణాలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో, టైప్-2 మధుమేహం వంటి వ్యాధులను నివారించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వ్యతిరేకంగా ప్రతిఘటించే సామర్థ్యం దానిమ్మపండులోని కొన్ని భాగాల్లో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దానిమ్మపండులో పాలీఫెనోలిక్ అనే ప్రయోజనకరమైన సమ్మేళనం ఉంటుంది. ఈ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దానిమ్మ రసం తాగితే ఛాతీ నొప్పి తీవ్రత తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా దానిమ్మ రసం నివారిస్తుంది. అందుకే ఈ జ్యూస్‌ని రెగ్యులర్‌గా తాగితే కిడ్నీలు బాగుంటాయని నిపుణులు సూచిస్తుంటారు. దానిమ్మ రసం నోటి దుర్వాసనను తగ్గిస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించడం ద్వారా దంత క్షయాన్ని నివారిస్తుంది. క్రమం తప్పకుండా దానిమ్మ రసాన్ని తింటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దానితో పాటు ప్రేగులలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా గ్యాస్-గుండె మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దానిమ్మలో ఉండే ఎల్లాగిటానిన్ అనే యాంటీఆక్సిడెంట్ అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను నివారించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుంది.



## మంత్రి తుమ్మలను కలిసిన సహకార సంఘాల చైర్మన్లు



**మానకొండూర్, ఆగస్టు12(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని మండలాల్లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లు బుధవారం టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కలిసి మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలు, రైతులకు సమర్థవంతంగా చేరేలా కృషి చేస్తూ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్లకు మంత్రి సూచించారు. మానకొండూర్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,రొంటాల లక్ష్మారెడ్డి,కొత్త రాంరెడ్డి,నాగిశెట్టి రాజయ్య,తిమ్మాపూర్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి,బెజ్జంకి చైర్మన్ ఒగ్గు దామోదర్, ఇల్లంతకుంట చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, శంకరపట్నం మండల చైర్మన్లు గోపగోని బస్వయ్యగౌడ్, కీసర సంపత్,గాజుల మహేష్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# బిజెపి శాఖ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" ర్యాలీ నిర్వహించారు

### ప్రజలకు జాతీయ జెండాలుఅందజేశారు

### బిజెపి మండల అధ్యక్షుడు సాయికిరణ్





**కామారెడ్డి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలంలోని బీర్కూరు గ్రామంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు కేంద్రం బిజెపి శాఖ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" ర్యాలీ నిర్వహించడం జరిగింది అలాగే మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయల్లో, ప్రజలకు జాతీయ జెండాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాగేళ్ల. సాయికిరణ్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి పైన జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తి చాటుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాగేళ్ల. సాయికిరణ్ మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేశ్వర్, మండల ఉపాధ్యక్షులు హనుమాన్లు, బిజెపి సీనియర్ నాయకులు బీరుగొండ, సాయిబాబా,ప్రవీణ్, నాగేష్, కార్యకర్తలు బసవరాజ్, శంకర్,గ్రామయువత,శేఖర్,గంగు,విజయ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క పౌరుడికి దేశం పట్ల భక్తిశ్రద్ధలు ఉండే విదంగా చూడాలి

### బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి



**ధర్మపురి, ఆగష్టు 12, (ది క్రైమ్ న్యూస్):** ప్రతి ఒక్క పౌరుడికి దేశం పట్ల గౌరవం భక్తిశ్రద్ధలు ఉండే విదంగా చూడాలని బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి అన్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ, రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ పిలుపుమేరకు హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి ఆధ్వర్యంలో మండలంలోని రాజారం గ్రామంలో శివాజీ విగ్రహం నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామ నలు విధుల్లో ర్యాలీ చేసి శివాజీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ ఒక తాటి పైకి తెచ్చే విధంగా దేశం కోసం ధర్మం కోసం ప్రశాంతమైన వాతావరణంలో బతకడంలో భాగంగా ప్రతి ఒక్కరు కూడా తన ఇంటిపై జాతీయ జెండా ఎగిరేవేయాలని భారత ప్రధానమంత్రి నరేందర్ మోడీ పిలుపునివ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్క పౌరుడికి దేశం పట్ల గౌరవం భక్తిశ్రద్ధలు ఉండే విధంగా చేయాలని అలాగే దేశద్రోహుల గుండెల్లో గుణపాలు దించే విధంగా ఉండాలని తెలిపారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న వారికి గుణపాఠం చెప్పే విధంగా తిరంగ ర్యాలీలు చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునివ్వడం జరిగింది. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా దేశభక్తిని చాటడం కోసం తమ ఇంటిపై జెండా ఎగరవేయాలని కోరడం జరుగింది. ప్రతి ఒక్కరు తన ఇంటిపై జెండాలు ఎగురవేసి నరేంద్ర మోడీ నీ బలపరచావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ధార్మిక ఎండోమెంట్ జిల్లా కో కన్వీనర్ కలకోట రాజేష్, మండల ఉపాధ్యక్షులు ఓగేటి అంజన్న, మండల కార్యదర్శి రంగ శ్రీధర్, కోశాధికారి ఉయ్యాల వెంకటేష్, బిజీవైఎం నాయకులు కోడిగంటి కిరణ్, సందవేని సతీష్, బొమ్మ కంటి పోచమల్లు, కార్యకర్తలు, నాయకులు, జాతీయ వాదులు, అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

# విశ్వజి

# చేద్దామా.. 75 చాలెంజ్!



ఇప్పుడంతా.. '75 హార్డ్ చాలెంజ్' ట్రెండ్ కొనసాగుతున్నది. 2025 నూతన సంవత్సర తీర్మానాల్లో.. ఇప్పుడిదే వైరల్‌గా మారింది. దీని గురించి కొత్తగా వింటున్నవారు మాత్రం.. '75 హార్డ్ చాలెంజ్' అంటే ఏమిటి? దీని నియమాలేంటి? దీన్ని కొనసాగించడం వల్ల కలిగే లాభాలేంటి? నష్టాలేంటి? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈక్రమంలో '75 హార్డ్ చాలెంజ్' గురించి వ్యాయామ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. '75 హార్డ్ చాలెంజ్'లో కఠిన నియమాలను పాటించాల్సి ఉంటుంది. అందులో ప్రధానమైనది.. 75 రోజులపాటు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తీసుకోవాలి. జంక్‌ఫుడ్‌కు, మద్యానికి దూరం పాటించాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు చొప్పున 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి. ఈ రెండు వ్యాయామాల్లో ఒకటి కచ్చితంగా ఇంటి బయటే చేయాల్సి ఉంటుంది. పార్క్, జిమ్, ఆరుబయట ప్రదేశాలను ఎంచుకోవచ్చు. రోజూ మూడు లీటర్ల మంచినీళ్లు తాగాలి. ప్రతిరోజూ కనీసం 10 నిమిషాలపాటు ఒక నాన్ ఫిక్షన్ పుస్తకం చదవాలి. కొంచెం కష్టమైనా.. ఇష్టంగా ఫాలో అయిపోతే మానసికంగా, శారీరకంగా ఎంతో మార్పు కనిపిస్తుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈ చాలెంజ్‌లోకి దిగినవారిలో చాలామంది.. 75 రోజులు పూర్తయినా ఈ నియమాలను కొనసాగిస్తూనే ఉన్నారట. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఆహార అలవాట్లు మెరుగుపడటం, పుస్తకాలు చదివే పద్ధతిలోనూ వారు చాలా మార్పులు గమనిస్తున్నారట. 75 రోజులపాటు ఫాలో కావడం వల్ల.. ఈ చాలెంజ్ ప్రభావాలు త్వరగా వదిలిపోవని నిపుణులు చెబుతున్నారు. బయటి ఆహారాన్ని మానేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు డబ్బుకూడా ఆదా అవుతుందని అంటున్నారు. ఇక పుస్తకాలు చదవడం.. ఆలోచనా విధానంలో మార్పులు తీసుకొస్తుంది. ఇలా.. ఇష్టపడి చేస్తే చాలెంజ్‌ను పూర్తి చేయడంతోపాటు దీర్ఘకాలంపాటు కొనసాగించవచ్చని సలహా ఇస్తున్నారు.



## జుట్టు పెరుగుదలను అడ్డుకుంటున్న ఈ ఆహారాలతో జాగ్రత్త!

చాలామంది తమ జుట్టు పెరగడం లేదని తమ జుట్టు ఆరోగ్యంగా లేదని బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు జుట్టు పెరగడానికి తీసుకునే ఆహారాలను గురించి తెలుసుకొని వాటిని తింటే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. మన జుట్టుకు కూడా పోషకాలు కావాలి. ఆ పోషకాలు ఏ ఆహారంలో ఉంటాయో తెలుసుకొని కచ్చితంగా తినాలి. అప్పుడే మన జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. జుట్టు పెరుగుదలను నిరోధించే ఆహారాలు ఇదే సమయంలో జుట్టు పెరగడానికి తినాల్సిన ఆహార పదార్థాలను తెలుసుకోవడమే కాకుండా మన జుట్టు పెరుగుదలను అడ్డుకుంటున్న ఆహారాల గురించి కూడా మనం తెలుసుకోవాలి.మన జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీసి మన జుట్టు పెరుగుదలను అడ్డుకునే అనేక ఆహారాలు ఉంటాయి. కొన్ని రకాల చెత్త ఆహారాలు మీ జుట్టు రాలిపోయేలా చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. అటువంటి వాటిలో ముఖ్యంగా చెప్పవలసింది ఎక్కువగా స్వీట్లు, కేకులు తినడం. %జుఇజూవతీం జఅవషం టతీశీఎ జుఇజూశ్రీశీతీవ వీశీతీవ చాశ్రీంశీ =ఝ౧% ఒకప్పుడు ఐఏఎస్..ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో కత్తిలాంటి హీరోయిన్ ఇవి తింటున్నారా? మీ జుట్టు రాలిపోవటం పక్కా చక్కెరతో తయారు చేసిన ఆహారాలను తింటే జుట్టు త్వరగా రాలిపోతుంది. చక్కెర అధికంగా ఉండే ఆహారాలు తినడం వల్ల ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది హార్మోన్లలో అసమతుల్యతకు కారణం అవుతుంది. జుట్టు రాలిపోవడానికి దోహదం చేస్తుంది. అధికంగా చక్కెర ఉన్న ఆహారాలు తీసుకోవడం జుట్టుకుదుళ్ళను దెబ్బతీస్తుంది. ఇవి తింటే జుట్టు పెరగటం కష్టమే ఇక వేపుళ్ళు.. కొంతమంది డీప్ ఫ్రై చేసిన ఆహారాలను ఎక్కువగా తింటారు. డీప్ ఫ్రై చేసిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్, అనారోగ్య కరమైన నూనెలు ఉంటాయి. ఇవి జుట్టు ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తాయి. విపరీతంగా ఉప్పు వేసిన ఆహారాలు కూడా జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉప్పు ఎక్కువగా తినడం గుండె ఆరోగ్యానికి మంచిది కాదు. ఉప్పు ఎక్కువగా తినడం జుట్టు సమస్యలకు కూడా కారణం అవుతుంది. ఇవి తింటే చుండ్రు సమస్యతో జుట్టు రాలిపోతుంది అధికంగా ఉప్పు తీసుకోవడంతో డిహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఇది మన జుట్టుకుదుళ్ళు సహజ నూనెలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఫలితంగా జుట్టు పొడిబారిపోయి రాలిపోతుంది. జుట్టు పెరగకుండా నిరోధించే ఆహారాలలో పాల ఉత్పత్తులు ఒకటి. పాలు కొన్నిసార్లు మన జుట్టు నూనె ఉత్పత్తిని పెంచి చుండ్రు సమస్యకు మొటిమల సమస్యకు కారణం అవుతాయి. %=వషిశీఎఎవఅనవస ఖీశీతీ శీబ% "పెదవుల రంగును బట్టి మీ ఆరోగ్య సమస్యలు తెలుసుకోవచ్చు!" జుట్టు ఆరోగ్యం కోసం వీటిని తినేటప్పుడు జాగ్రత్త జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాటిలో పాలు కూడా ఒకటి కాబట్టి పాల పదార్థాలు జుట్టు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. హై మెర్క్యూరీ ఫిష్.. ట్యూనా, స్వోర్డ్ ఫిష్, మాకేరేల్ వంటి కొన్ని చేపలలో అధిక స్థాయిలో మెర్క్యురీ ఉంటుంది. ఇక ఈ చేపలను తినడం వల్ల ఇది జుట్టు రాలడానికి కారణం అవుతుంది. జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఈ ఆహారాల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

## పైనాపిల్ తింటే గర్భిణి స్త్రీలకు ప్రమాదామా..?



గర్భధారణ సమయంలో పైనాపిల్ తినడం సురక్షితమా కాదా అనే ప్రశ్న చాలా మంది గర్భిణీ స్త్రీల మనసులో ఉంటుంది. పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ గర్భాశయ సంకోచాలను ప్రేరేపిస్తుందని, దీని వల్ల గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉందని చాలా మంది నమ్ముతారు. అయితే, ఈ నమ్మకం ఎంతవరకు నిజం? పైనాపిల్ గురించి తెలుసుకోవలసిన విషయాలు పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది మాంసాన్ని కరిగించే గుణం కలిగి ఉంటుంది. కొంతమంది ఈ ఎంజైమ్ గర్భాశయ కణజాలాన్ని కూడా కరిగించవచ్చు అని భావిస్తారు. పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉందనే నమ్మకానికి శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువ. బ్రోమెలైన్ గర్భాశయ సంకోచాలను ప్రేరేపించవచ్చు అనేది నిజమే. కానీ, పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ మొత్తం గర్భాశయాన్ని సంకోచింపజేయడానికి సరిపోదు.గర్భస్రావానికి అనేక కారణాలు ఉంటాయి. వీటిలో హార్మోన్ల అసమతుల్యత, జన్యుపరమైన లోపాలు, గర్భాశయ సంక్రమణలు మొదలైనవి ఉన్నాయి. %జుఇజూవతీం జఅవషం టతీశీఎ జుఇజూశ్రీశీతీవ వీశీతీవ చాశ్రీంశీ =ఝ౧% బాలకృష్ణతో సినిమాలు చేయకు..హీరోయిన్‌కు భర్త కండిషన్..? నిపుణులు ఏమి చెబుతున్నారు? చాలా మంది నిపుణులు పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం గర్భధారణ సమయంలో సురక్షితమే అని చెబుతున్నారు. అయితే, ప్రతి గర్భధారణ భిన్నంగా ఉంటుంది కాబట్టి, పైనాపిల్ తినే ముందు మీ వైద్యునితో సంప్రదించడం మంచిది. ముఖ్యమైన అంశాలు పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం ముఖ్యం. ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల అజీర్తి, గ్యాస్, హార్ట్ బర్న్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.మొదటి త్రైమాసికంలో పైనాపిల్ తినడం గురించి కొంతమంది నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో గర్భం బలహీనంగా ఉంటుంది.ఏదైనా ఆహారాన్ని గర్భధారణ సమయంలో తీసుకునే ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. చివరగా: పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉందనే నమ్మకానికి శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువ. అయితే, ప్రతి గర్భధారణ భిన్నంగా ఉంటుంది కాబట్టి, పైనాపిల్ తినే ముందు మీ వైద్యునితో సంప్రదించడం మంచిది.

## జాదూ జడావు

ఫ్యాషన్ ప్రపంచంలో భారతదేశానికి చెందిన సంప్రదాయ దుస్తులు, నగలు ఎప్పుడూ ప్రత్యేకమే! మగువల మేనిపై మెరిసిపోయే ఆభరణాలకు మనదేశమే పుట్టినిల్లు. సంక్లిష్టమైన కళానైపుణ్యంతో రూపొందిన జడావు ఆభరణాలకు పూర్వం ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. రాచరికపు శోభను ఇనుమడింప జేసేలా రాళ్లను పొదిగే ప్రత్యేక నైపుణ్యాన్ని జడావు కళగా పిలిచేవారు. అలా రూపుదిద్దుకున్న ఆభరణాలు జడావు నగలుగా ప్రసిద్ధి. నేటికీ పెండ్లిళ్లు, పండుగలు లాంటి సంప్రదాయ వేడుకల్లో ఈ భారీ నగలను ధరిస్తున్నారు. పట్టుచీర మీదికైనా, లంగావోణీ, గాగ్రా పైకి కూడా ఇవి అందంగా నప్పుతాయి. ఇందులో భారీ కంఠాభరణాలు, చోకర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కెంపులు, వజ్రాలు, పచ్చలు, వైడూర్యాలు ఇలా విలువైన రత్నాలను ఎలాంటి జిగురు లేకుండా నగల ఆకృతుల్లో పొదగడమే కాకుండా, ఎలాంటి ఎనామిల్ ఫినిషింగ్ లేకుండా రూపొందించడమే జడావు నగల ప్రత్యేకత. తరాల కిందటి నగలను ఈ తరం మెచ్చే విధంగా రూపొందిస్తున్నారు డిజైనర్లు. రాళ్ల కాంబినేషన్‌లోనూ వైవిధ్యాన్ని చూపుతూ అతివల మనసు దోచేస్తున్నారు. ఈ తరహా నగలు బంగారంలోనే కాకుండా ఇమిటేషన్ జువెలరీగానూ అందుబాటులోకి వచ్చాయి. వన్‌గ్రామ్ గోల్డ్, ఆక్సిడైజ్డ్ సిల్వర్‌లోనూ ఇవి దొరుకుతున్నాయి. ఎందుకు ఆలస్యం.. మీరూ ఒకసారి ట్రై చేయండి.



# మార్కెట్

## ఆల్‌టైమ్ రికార్డ్.. రూ.లక్ష దాటిన బంగారం ధరలు

ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళు తున్నాయి. సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూపోతున్నాయి. తాజాగా బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి తాకాయి. మంగళవారం దేశీయంగా 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి ధర ఏకంగా రూ.లక్ష దాటింది. ఢిల్లీ (%ణవశ్రీష్ట్రఱ%), ముంబై, కోల్‌కతా, చెన్నై సహా అన్ని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన ఒక గ్రాము బంగారం ధర రూ.10,000 పైనే పలుకుతోంది. అత్యధికంగా దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం ధర రూ.1,02,160కు చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,150గా ఉంది. నోయిడా, గురుగ్రామ్, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,135గా ఉంది. రానున్న రోజుల్లో తులం బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కరెన్సీ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలహీనపడటం, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం.. గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నది. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను పసిడి వైపునకు మళ్లిస్తున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలతో కొనుగోలుదారుల నుంచి పెద్దగా గిరాకీ లేకున్నా.. జ్యుయెల్లర్స్, రిటైలర్స్ నుంచి డిమాండ్ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో పుత్తడి ధరలు దౌడు తీస్తున్నాయని మెజారిటీ నిపుణుల విశ్లేషణ. కాగా, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం చైనా మినహా మిగతా దేశాలపై ఆగినా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మాత్రం ఆ సెగ తగులుతూనే ఉన్నది. ఈ క్రమంలో ఆయా దేశాలతో జరుగుతున్న అమెరికా ట్రేడ్ డీల్స్‌నుబట్టి భవిష్యత్తులో బంగారం రేట్ల పెరుగుదలలో వేగం ఉంటుందని అంచనా వేస్తున్నారు.




## ఎకోరెన్‌పై అనుమానాలెన్నో!



రూ.27వేల కోట్లతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంవోయూ బాబు డైరెక్షన్‌లో ఈ సంస్థ తెలంగాణకు వచ్చినట్టు ప్రచారం పదేండ్ల క్రితం మొదలైన సంస్థ భారీ పెట్టుబడి పెట్టగలదా? ఎకోరెన్ ప్రమోటర్ లక్ష్మీప్రసాద్ బాబు అనుచరుడి బంధువే!

రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లు పెట్టేందుకు ఎకోరెన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.27 వేల కోట్లతో రేవంత్ సర్కారుతో ఒప్పందం కుదుర్చుకున్నది. పదేండ్ల క్రితమే మొదలైన ఈ సంస్థకు ఇంత భారీ పెట్టుబడులు పెట్టే సత్తావున్నదా? లేక షెల్ కంపెనీయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ సీఎం బాబు డైరెక్షన్‌లోనే ఒప్పందం కుదిరినట్టు తెలుస్తున్నది.

హైదరాబాద్ : రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎకోరెన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.27 వేల కోట్ల పెట్టుబడుల పెట్టేందుకు ముందుకొచ్చింది. అసలీ ఈ కంపెనీ తెలంగాణకు ఎలా వచ్చింది? ఇంతటి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే సత్తావున్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ సంబంధాలతో అడుగుపెట్టిందా..? లేక నిజంగానే ఈ కంపెనీకు అంత ఆర్థిక సత్తా ఉందా? ఇదేమైనా డొల్ల కంపెనీయా..? అని విద్యుత్తు రంగ నిపుణులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలే ఎకోరెన్ ఇండియా ఎనర్జీ లిమిటెడ్.. టీజీ రెడ్‌కోతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,279 మెగావాట్ల విండ్ %-% సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్ట్‌తోపాటు 1,650 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్స్, 650 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

బాబు డైరెక్షన్‌లోనేనా.

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరగానే ఎకోరెన్ ఎనర్జీ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు జెట్ స్పీడ్‌తో ఆగమేఘాల మీద అనుమతులొచ్చాయి. శ్రీ సత్యసాయి అనంతపురం జిల్లాల్లో రూ.1,600 కోట్లకు పైగా పెట్టుబడులకు ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నలిచ్చింది. ఈ కంపెనీ ప్రమోటర్ అయిన యెర్నేని లక్ష్మీప్రసాద్ డైరెక్టర్‌గా ఉన్న అనంతపూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కూడా ప్రభుత్వం రూ.970 కోట్ల పెట్టుబడులకు రెడ్‌కార్పెట్ పరిచింది. ఆ వెంటనే ఇదే సంస్థ రూ.27వేల కోట్లను పెట్టుబడి పెడతామని తెలంగాణకు వచ్చింది. వాస్తవానికి ఈ సంస్థ 2010లో ఏర్పాటైనట్టు తెలుస్తున్నది. ఇంత తక్కువ వ్యవధిలో అంత టర్నోవర్ ఎలా సాధించిందన్న దానిపై అనుమానాలొస్తున్నాయి. ఎకోరెన్ అనుబంధ సంస్థ అయిన బోరియాస్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మధ్య తలెత్తిన వివాదం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వద్దకు చేరింది. కర్ణాటకలోని బళ్లారిలో 175 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటుచేసిన సంస్థ రూ.2.77కు యూనిట్ చొప్పున సరఫరా చేస్తామన్నది. 2020 డిసెంబర్ వరకు పూర్తిచేయాల్సి ఉండగా, నిర్మాణం పూర్తికాలేదు. దీంతో వివాదానికి దారితీసింది.

పొలిటికల్ లింకుతోనేనా..

ఎకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ వ్యవస్థాపకులైన యెర్నేని లక్ష్మీప్రసాద్ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన లింగమనేని రమేశ్‌కు సమీప బంధువుట. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబుకున్న పొలిటికల్ లింకులతోనే ఎకోరెన్ తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నదా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

## దేశీయ స్టాక్ మార్కెట్స్‌లో లాభాల జోష్..

### వరుసగా ఐదో సెషన్‌లోనూ బుల్ జోరు

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కొనసాగుతోంది. గత నాలుగు సెషన్‌లలో లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు ఇవాళ ఐదో సెషన్‌లో కూడా లాభాలు మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ, భారతీయ సూచీలు ఫుల్ జోష్‌లో ట్రేడయ్యాయి. అమెరికా టారిఫ్‌లపై ఉన్న ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో మార్కెట్‌కు ఊరట లభించింది. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి ప్రముఖ బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బ్యాంక్ నిఫ్టీ చరిత్రలోనే గరిష్ట స్థాయికి చేరుకుంది. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 855.30 పాయింట్ల లాభంతో 79,408 వద్ద ముగిసింది. అంటే 1.09 శాతం లాభపడింది. అదేవిధంగా నిఫ్టీ సైతం 273.90 (1.15 శాతం) పాయింట్ల లాభంతో 24,125 వద్దకు సెటిలైంది. మొత్తంగా చూస్తే 2,829 షేర్‌లు లాభపడగా, 1093 షేర్‌లు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఇంకో 149 షేర్‌లు ఎలాంటి మార్పు లేకుండా ఉన్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## బిఎల్‌వోలు నేరుగా ఓటర్ల వద్దకు వెళ్లాలి

### సిఇవోను కలిసి విన్నవించిన మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి,ఆగస్టు12 : ఓటర్ల జాబితా సవరణలు, సమస్యలపై ఆంధ్రప్రదేశ్ సీఈఓను కలిశానని మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల్లోనూ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారని తెలిపారు. అయితే పెండింగ్‌లో ఉన్న 14 నియోజకవర్గాల జాబితా ఈరోజు ఇచ్చారని ప్రస్తావించారు. 44 లక్షల సవరణ నోటీసుల్లో కేవలం 10శాతం మాత్రమే ఇచ్చారని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఈఓకు విజ్ఞప్తి చేశామని అన్నారు. చిన్న చిన్న సవరణల కోసం ఓటర్లను ఎమ్మార్వో/తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిప్పవద్దని కోరారు. బీఎల్‌వోలు నేరుగా గ్రామాలు, వార్డులకు వెళ్లి సమాచారం సేకరించి ఓటర్ జాబితా సవరణలు పూర్తి చేయాలని ప్రతిపాదించామని అశోక్ బాబు తెలిపారు. నూతన ఓటర్ల నమోదులో 01-07-2026 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై నిబంధనలు స్పష్టమైన విచారణ, నోటీసు, స్పీకింగ్ ఆర్డర్ లేకుండా ఓట్లను తొలగించవద్దని సూచించారు. సెప్టెంబర్ వరకు సమయం చాలకపోతే కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడిగి ప్రక్రియ గడువును మరో 10 నుంచి15 రోజులు పొడిగించాలని అశోక్ బాబు కోరారు.

## కాల్వలో దూకి ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

### యువకుడిని కాపాడిన స్థానికులు

### యువతి గల్లంతుతో గాలింపు ముమ్మరం

భీమవరం,ఆగస్టు11 : పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం వేంద్ర అడవి కోడి కాల్వ వద్ద ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాలువలో ఆ ప్రేమ జంట దూకింది. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో.. ఆ జంట కొట్టుకుపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు.. వెంటనే కాలవలోకి దూకి యువకుడిని కాపాడారు. యువతి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. దీనిపై స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. యువతి కోసం వారంతా గాలిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామానికి చెందిన సందీప్ కుమార్, భీమవరంకు చెందిన యువతిగా పోలీసులు గుర్తించారు. ఈ ఆత్మహత్యయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఇరు కుటుంబాలకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు ముందే వీరు తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాము చావబోతున్నట్లు తెలిపారు. ఆ తరవాత కాల్వలో దూకారు.

## కదిరి రౌడీ షీటర్ శివ ఇంటి వద్ద హైడ్రామా

### అరెస్ట్ వారంట్‌తో పోలీసులు రావడంతో నిరసన

శ్రీ సత్యసాయి,ఆగస్టు12 : కదిరిలో శివ అనే రౌడీషీటర్ ఇంటి వద్ద హైడ్రామా నెలకొంది. రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులకు తీవ్ర నిరసన ఎదురైంది. శివపై అనంతపురం ఎస్సీ, ఎస్టీ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలోనే శివను అదుపులోకి తీసుకునేందుకు కదిరి పోలీసులు ఇంటికి చేరుకున్నారు. అయితే, పోలీసుల రాకను గమనించిన రౌడీ షీటర్ కుటుంబ సభ్యులు ఒక్కసారిగా వారిపై తిరగబడటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాదాపు రెండు గంటల పాటు శివ ఇంటి వద్ద తీవ్ర హైడ్రామా నడిచింది. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు రౌడీషీటర్ శివతో పాటు అతని భార్య, తల్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ముగ్గురినీ పోలీసులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం అక్కడ నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో రౌడీషీటర్ శివ తండ్రి చంద్రశేఖర్ పోలీసులను తీవ్ర పరుష పదజాలంతో దూషించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 'పోలీసుల విధులకు తీవ్ర ఆటంకం కలిగించడమే కాకుండా ఉద్రిక్తతలకు కారణమైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## వేంకటేశ్వరుడిని అవమానించిన వారిపై క్రిమినల్ కేసులు

### టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరిక

నెల్లూరు,ఆగస్టు12 : కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామిని వైసీపీ నేతలు.. వీధి నాటకాల్లో రాజకీయాలకు వాడుకుంటున్నారని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి బుద్ధుందా అంటూ ఫైర్ అయ్యారు. వేంకటేశ్వర స్వామిని అవమానించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. స్వామి వారి అలిపిరి పాదాల వద్దకి వచ్చి చంద్రశేఖర్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. 2019 నుంచి 2024 వరకు స్వామి వద్ద చేయకూడని తప్పులు చేశారని భానుప్రకాశ్ విమర్శించారు. రాష్ట్రాన్ని వికసిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. డీఎస్సీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. డీఎస్సీ పేరు మీద డర్టీ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ జరగకూడదంటూ దుర్మార్గపు ఆలోచనతో 32 కేసులు వేశారని వైసీపీ నేతలపై భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### మన వారసత్వంతో ఏనుగులు భాగస్వామ్యం

అమరావతి,ఆగస్టు12 : ఏనుగుల సంరక్షణకు కట్టుబడి ఉన్నామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. ఏనుగుల ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏనుగు కేవలం అడవిలో జీవి మాత్రమే కాదని, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అన్నారు. భారతదేశ వారసత్వం లో ఏనుగులు అంతర్భాగమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుంకీ ఏనుగులు, హనుమాన్ చొరవతో వన్యప్రాణుల రక్షణ రక్షణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామని పవన్ వెల్లడించారు. శిక్షణ పొందిన సిబ్బంది, రెస్క్యూ మౌలిక వసతులు, సాంకేతికతతో వేగవంతంగా స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సురక్షిత సమాజాలు, రక్షిత అడవులు, ఏనుగులకు సురక్షిత ఆవాసాలే లక్ష్యమని స్పష్టం చేశారు. ఏనుగులను కాపాడాలి.. అడవులను రక్షించాలి.. భవిష్యత్తు ను భద్రపరచాలి అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# అసెంబ్లీ సమావేశాలకు వైసిపి దూరం

### మండలి సమావేశాలకు మాత్రం వస్తాం

### పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశం

### ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న బొత్స



అమరావతి,ఆగస్టు12 : అసెంబ్లీ సమావేశాలకు ఈసారి కూడా హాజరుకాకూడదని వైసీపీ నిర్ణయం తీసుకుంది. అయితే శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని నిర్ణయించింది. వైసీపీ శాసనసభాపక్ష సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీలో వైసీపీకి తగిన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై ఆ పార్టీ మొదటి నుంచి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మరోసారి స్పందించారు. అసెంబ్లీలో ప్రస్తుతం రెండు పక్షాలే ఉన్నాయని, మూడో పక్షం లేదని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చట్టసభలో గళం విప్పాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభ్యులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రజా సమస్యలపై పోరాటానికి సభ్యులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశ వివరాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు తెలియజేశారు.. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బొత్స సత్యనారాయణ అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు ఈ అంశంపై పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని చట్టసభలో నిలదీస్తామని తెలిపారు. నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోందని బొత్స ప్రశ్నించారు. అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శలు చేసింది. ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాయని, వారి సమస్యలపై కూడా పార్టీ తరఫున మాట్లాడతామని తెలిపారు. అసెంబ్లీలో ఉన్నవి రెండే పక్షాలు.. మూడోది లేదు కదా. అలాంటిది 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, అలాగని చట్టంలో ఉంటే డిస్‌క్వాలిఫై చేయాలని బొత్స కోరారు. రాజ్యాంగబద్ధంగానే పోరాడుతున్నాం. ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఫేక్ పోలీసులతో నడిపిస్తున్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సీఎం కావడం మన ఖర్మ. అందరి తరఫున అడుగుతాం. అన్ని ఆధారాలు చూపిస్తాం. అన్ని విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని బొత్స తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై నిరసనగా వైఎస్సార్‌సీపీ శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే నిర్ణయించింది. అయితే శాసన మండలి సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించింది. ఇక మండలిలో పార్టీ తరఫున డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

## మాషా అల్లా స్కాం బాధితులకు అండ

### గ్రీవెన్స్‌లో హోంమంత్రి అనిత హామీ

అమరావతి,ఆగస్టు12 : మీకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాషా అల్లా స్కాం బాధితులకు హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మాషా అల్లా బాధితులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ గ్రీవెన్స్‌లో దాదాపు 200 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత్ మాట్లాడుతూ.. ఈ స్కాంపై తక్షణమే విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో డీసీపీ క్రైమ్స్ తిరుమలేశ్వర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని చెప్పారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ బాధితుల సమస్యపై విజయవాడ పోలీస్ కమిషనర్‌తో ఆమె మాట్లాడారు. ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తామనే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు. పేదల కష్టార్జితాన్ని లక్ష్యంగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. నాయుడుపేట నుంచి టీడీపీ గ్రీవెన్స్‌కు వచ్చిన తండ్రి?ఏడేళ్ల కుమార్తెకు హోం మంత్రి అనిత సాయం చేశారు. తండ్రికి ఉపాధి, కుమార్తెకు వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే టీడీపీ గ్రీవెన్స్ ప్రధాన లక్ష్యమని హోం మంత్రి అనిత వెల్లడించారు. తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో టీడీపీ కార్యాలయానికి వచ్చినట్లు ఈ సందర్భంగా ఆ కుటుంబం వెల్లడించింది.

## ప్రభుత్వ కార్యక్రమాలలో తొలుత తమిళత్తాయ్ గీతాలాపన

### సిఎం విజయ్ కు ఎంపి కమలహాసన్ అభినందన

చెన్నై,ఆగస్టు11 : తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభ ఆమోదించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ ఖాతాలో మంగళవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభలో ఆమోదించడం సంతోషకరం. ఇది కచ్చితంగా స్వాగతించదగినది. రాష్ట్ర హక్కులను వదులుకోని ఈ విధానం ఇలాగే కొనసాగాలి' అని రాసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయమైన 'వందేమాతరం'ను మొదటగా ఆలపించాలని, ఆ తర్వాతే ఇతర గీతాలను ఆలపించాలని కేంద్ర హోంశాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు అంతర్గత మార్గదర్శకాలను, సూచనలను జారీ చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'తమిళం కేవలం ఒక భాష మాత్రమే కాదు, అది మన ప్రాణం, భావోద్వేగం' అని ఆయన పేర్కొన్నారు. సీఎం విజయ్ ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక తీర్మానానికి అసెంబ్లీలోని ప్రధాన ప్రతిపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకేతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి.

## వైసిపి హయాంలో గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు

### దీనిపై హైకోర్టుకు సిట్ నివేదిక అందచేత

### ఈ అక్రమాలపై వైసిపిని గట్టిగా నిలదీయాలి

### మంత్రులతో భేటీలో సిఎం చంద్రబాబు

అమరావతి,ఆగస్టు12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఘోర తప్పిదాలు జరిగాయని సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవలి కాలంలో ఇంత అన్యాయంగా జవాబపత్రాల ముల్యాంకనం ఎన్నడూ జరగలేదని.. మూడు సార్లు పేపర్లు దిద్దించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు సంబంధించిన నివేదికను హైకోర్టుకు సిట్ సమర్పించిందని.. దీనిపై వైసీపీని నిలదీయాల్సిందే అని మంత్రులకు సూచించారు. అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఘోర తప్పిదాలు జరిగాయని సీఎం అన్నారు. మంత్రులు అందరూ సిట్ రిపోర్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వైసీపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. వాటిపై అసెంబ్లీలో కూడా చర్చిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీలో ఎటువంటి తప్పులూ చేయలేదని, అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. డీఎస్సీపై వైసీపీ శాసనమండలిలో లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని, ఆధారాలతో సహా నిరూపిద్దామని మంత్రులకు సూచించారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అగ్రెసివ్‌గా ముందుకు వెళదామని, వైసీపీ నేతలను అసెంబ్లీకి రమ్మని సవాల్ చేయాలన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట డ్రామాలాడితే ప్రజలు నమ్మరని చెప్పుకొచ్చారు. రాని, అర్హత లేని ప్రతిపక్ష హోదాను ఎవరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా.. 23 మంది ఉంటే నలుగురిని లాగేస్తే ప్రతిపక్షహోదా టీడీపీకి పోతుందని జగన్ చెప్పారని, ఇప్పుడు ఆ మాటలను మరిచిపోయారని మంత్రులు తెలిపారు. సోషల్ మీడియాలో ఆనాటి జగన్ మాటలు నేటికీ చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై శాసనమండలిలో దుమ్ముదులుపుతామని మంత్రులు అన్నారు. ఈ సందర్భంగా సిట్ నివేదికను తెలుగులోకి అనువదించి మరీ మంత్రులకు సీఎంవో అధికారులు వివరించారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,ఆగస్టు12 : గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

## అసెంబ్లీకి రాకుండా జీతమంటే ఎలా ?

అమరావతి,ఆగస్టు12 : అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం సరికాదని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఈ నెల 17న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు స్పీకర్ తెలిపారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు సభకు హాజరు కావడం, ప్రజల సమస్యలపై చర్చించడం మంచి పద్ధతని అన్నారు. అయితే సభకు రాకుండానే జీతాలు తీసుకోవడం మాత్రం సరికాదన్నారు. ప్రజలు తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషిచేస్తారనే ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారు. అయితే ప్రజాప్రతినిధులు తమ బాధ్యతల ను విస్మరించి సభకు హాజరు కాకుండా జీతాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా బయట సంతకాలు చేసి వెళ్లిపోతున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్పీకర్ వ్యాఖ్యలు చేశారు. సభ్యుల హాజరును పారదర్శకంగా పర్యవేక్షించేందుకు వారి సీట్ల వద్ద కెమెరాలను ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యే తన సీటులో ఉన్నప్పుడే సభకు హాజరైనట్లు పరిగణించే విధానాన్ని అమలు చేయబోతున్నాం' అని వెల్లడించారు. డీఎస్సీ అంశాన్ని అనవసరంగా వివాదం చేయడం సరికాదన్నారు. క్రీడాకోటా నియామకాలకు సంబంధించి వాస్తవాలను రికార్డుల పరిశీలన అనంతరం వెల్లడించాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్పోర్ట్స్ అంటే మాజీ మంత్రి రోజా కబడ్డీ ఆడినట్లా అని ఎద్దేవాచేశారు.

## కొండపై ఎండిపోతున్న జలాశయాలు

### వరుణయాగం నిర్వహించడంలో టిటిడి విఫలం

### మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు

తిరుపతి,ఆగస్టు12 : టీటీడీ పాలనపై మాజీ టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రెండున్నరేళ్లుగా టీటీడీకి చంద్రగ్రహణం పట్టింది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా, కొండపై జలాశయాలు ఎండిపోతున్నా.. వర్షాల కోసం వరుణయాగం నిర్వహించాలన్న ఆలోచన కూడా టీటీడీకి లేకపోవడం బాధాకరమంటూ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో టీటీడీ ఆధ్వర్యంలో అనేక వైదిక కార్యక్రమాలు, యాగాలు నిర్వహించామని గుర్తు చేశారు. దేశం, రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని శతాబ్దాలుగా టీటీడీ యాగాలు నిర్వహిస్తూ వస్తోందని చెప్పారు. అయితే ప్రస్తుత పాలకులు టీటీడీ వైదిక కార్యక్రమాలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపించారు. శ్రీవారి ఆలయ ప్రతినిధులే మంటగలుపుతున్నారు. వేద సంస్కృతిని భ్రష్టు పట్టిస్తున్నారు. ధార్మిక కార్యక్రమాలను పక్కనపెట్టి దహన కార్యక్రమాల్లో మునిగిపోయారు అంటూ మండిపడ్డారు. వేద పరిరక్షణ కోసం నిధులు ఉన్నప్పటికీ అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తిరుమల కొండపై ఉన్న జలాశయాలు సైతం ఎండిపోతున్నాయని భూమన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీటీడీ వరుణయాగం నిర్వహించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. చిన్న దేవాలయాల పాలక మండళ్లు సైతం వరుణయాగాలు నిర్వహిస్తున్నాయని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీటీడీ మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వీఐపీ సేవల్లో కాకుండా ప్రజల శ్రేయస్సుపై దృష్టి పెట్టాలి. వెంటనే మేల్కొని వరుణయాగం నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీటీడీ పాలకులు వేద, వైదిక సంప్రదాయాలను పరిరక్షించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇది కేవలం విమర్శ కాదు.. బుద్ధి తెచ్చుకుని వైదిక కార్యక్రమాలను, వేద సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు.

## తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త

### రేణిగుంట విమానాశ్రయంలో ఈ వీసా సేవలు

తిరుపతి,ఆగస్టు12 : తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ - వీసా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం విదేశీ భక్తులు రావాలంటే.. ముందుగా చెన్నై, బెంగళూరు లేదా హైదరాబాద్ చేరుకోవాల్సి వచ్చేది. అక్కడ ఈ -వీసా ప్రక్రియ పూర్తి చేసుకుని ఆ తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకునే వారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తిరుపతి విమానాశ్రయంలో ఈ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇకపై ప్రయాణికులు విదేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకొని ఈ - వీసా ప్రక్రియ ముగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణానికి కనీసం పది రోజులు ముందే ఆన్‌లైన్‌లో ఈ - వీసాను ప్రయాణికులు అందుకోవాల్సి ఉంటుంది. యితే తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ సర్వీసులు లేనప్పటికీ ముందస్తుగానే ఈ - వీసా కౌంటరును కేంద్ర పౌర విమానయాన శాఖ మంజూరు చేసింది. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

### గ్రీన్‌ఫీల్డ్ హైవేపై లారీని ఢీకొన్న బస్సు

#### ప్రమాదంలో 30మందికి తీవ్ర గాయాలు


ఏలూరు,ఆగస్టు12 : ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బుధవారం ఉదయం ప్రమాదం జరిగింది. హైవేపై ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ఇంటర్‌సిటీ స్మార్ట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది గాయపడినట్లు సమాచారం.



# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

## నటి సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.




# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ

భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మళయాళంలోనూ ఎంట్రీ

# ఇచ్చిన రుక్మిణీ వసంత్

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక్-టు-బ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇది గనుక అధికారికంగా ఖరారైతే రామ్ చరణ్ ? రుక్మిణీల ఫస్ట్ కాంబినేషన్‌గా ఇది సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయం. భాషతో సంబంధం లేకుండా లక్కీ చార్మ్‌గా మారిన రుక్మిణీ వసంత్ రాబోయే రోజుల్లో సౌత్ లేడీ సూపర్ స్టార్‌గా నిలిచినా ఆశ్చర్యం లేదంటున్నారు సినీ విశ్లేషకులు.



# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

## జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్‌ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com